

కాంగ్రెస్ కార్యాలయం.. కళ.. కళ..!



ఏఐసీసీ ఓబీసీ సలహా మండలి సమావేశంలో పాల్గొన్న ప్రముఖులు

- వివిధ రాష్ట్రాల మాజీ సీఎంలు, ఎంపీలు, మంత్రుల రాక
- జాతీయ సభలకు వేదికగా మారుతున్న కర్ణాటక
- ముగిసిన ఏఐసీసీ ఓబీసీ సలహా మండలి సభ

బెంగళూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): అఖిల భారత కాంగ్రెస్ కమిటీ దేశవ్యాప్తంగా ఓబీసీ వర్గాల మద్దతు కూడగట్టుకునేందుకు జాతీయస్థాయిలో పార్టీ ఓబీసీ వర్గాల సలహా మండలి ఏర్పాటు చేసింది. రెండువారాల క్రితం ఏర్పడిన మండలి తొలి సమావేశం బెంగళూరు వేదికగా రెండు రోజుల పాటు నిర్వహించారు. వివిధ రాష్ట్రాల కాంగ్రెస్ ముఖ్యనేతలు, మాజీ ముఖ్యమంత్రులు, మంత్రులు, ఎంపీలతోపాటు ముఖ్యులు పాల్గొన్నారు. రెండు రోజుల సమావేశాలతో క్వీన్స్ రోడ్డులోని కాంగ్రెస్ కార్యాలయం, భారత్‌జోడో భవన్ కళకళలాడింది. మంగళవారం తొలిరోజున సభలో రాష్ట్ర మంత్రులతోపాటు రాష్ట్రస్థాయి ముఖ్యనేతలు భాగస్వాములయ్యారు. దేశంలో బీసీ కులాలకు ప్రాధాన్యత పెరగాలంటే రిజర్వేషన్ శాతం పెంచడంతోపాటు కులగణన కీలకమని చర్చించారు. ఇప్పటికే వివిధ రాష్ట్రాలలో కాంగ్రెస్ పాలనలో ఓబీసీ వర్గాలకు అమలు చేసిన పథకాల గురించి ప్రస్తావించారు. సమితిలో సీఎం సిద్దరామయ్య ప్రధానంగా పలు అంశాలను ప్రస్తావించారు. రాష్ట్రంలో పదేళ్ల క్రితమే కులగణన సర్వే జరిపించామని ఓబీసీ కులాలకు చెందినవారు ఆర్థిక, విద్య, సామాజిక అంశాలలో ప్రగతిని నిర్ణయించేందుకు అమలు చేశామన్నారు. అయితే ఆ తర్వాత వచ్చిన సంకీర్ణ, బీజేపీ ప్రభుత్వాలు వాటిని అమలు చేయలేదన్నారు.

● దేశంలో 1931 తర్వాత తొలిసారి కులగణన కర్ణాటకలోనే జరిగిందన్నారు. ఓబీసీలోనూ ఉపకులాలు ఎన్ని ఉన్నాయనేది నిర్ణయించేందుకు అమలు చేశామన్నారు. తెలంగాణ ప్రభుత్వం నుంచి వచ్చిన ప్రతినిధులు మంత్రులు కొండా సురేఖ, వీ హనుమంతరావు ఆ రాష్ట్రంలో కులగణన సర్వే జరిపిన తీరు, ఆ తర్వాత రిజర్వేషన్ అమలు వంటి అంశాలను ప్రస్తావించారు. చత్తీస్‌ఘడ్, రాజస్థాన్, పుదుచ్చేరిల మాజీ ముఖ్యమంత్రులు పలు అంశాలను లేవనెత్తారు. రెండోరోజు బుధవారం వసంతనగర్‌లోని ఓ హోటల్‌లో సమావేశం జరిగింది. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన సభ మధ్యాహ్నం 2 గంటలదాకా కొనసాగింది. చివరగా తొలి ఓబీసీ సలహా సమితి సమావేశం కీలక నిర్ణయాలు తీసుకుంది. బీసీ కులాల అభ్యున్నతి పట్ల ప్రత్యేక చొరవ చూపుతున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని న్యాయ యోధుడిగా ఏకగ్రీవంగా ప్రకటించారు. తెలంగాణ కులగణన మాదిరిని పాటించాలని తీర్మానించారు. రాజ్యాంగ ఆశయానికి అనుగుణంగా సామాజిక న్యాయం పొందే దిశలో ఇదో తొలి అడుగు అని తీర్మానించారు. జాతీయ జనాభా లెక్కలు పర్యవేక్షించే రిజిస్ట్రార్ జనరల్, జనాభా లెక్కల కమిషనర్ జాతీయస్థాయిలో జనాభా లెక్కల వేళ కులగణనలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ అంశాలను పరిగణించాలని, తెలంగాణ రాష్ట్ర సీప్ క్యాస్ట్ సర్వేను మోడల్‌గా పరిశీలించాలన్నారు. రిజర్వేషన్‌ను 50శాతానికి మించి పరిగణించాలని, రాజ్యాంగం 15.5 (5) ఆర్టికల్ ప్రకారం ప్రైవేట్ విద్యాసంస్థలలో రిజర్వేషన్ అమలు చేయాలన్నారు.

● సభ ముగిశాక సీఎం సిద్దరామయ్య మీడియాతో మాట్లాడుతూ ఏఐసీసీ ఓబీసీ విభాగం సలహా మండలి తొలి సమావేశం విజయవంతమైందని, కీలక అంశాలు చర్చకు వచ్చాయన్నారు. సమాజంలో వెనుకబడిన వర్గాలకు అండగా నిలిచి వారి అభ్యున్నతికి పాటుపడాలనే రాహుల్‌గాంధీని న్యాయయోధుడిగా తీర్మానించినట్టు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ రాజ్యాంగానికి కట్టుబడి ఉంటుందన్నారు. కాంగ్రెస్ అల్పసంఖ్యాత, హిందుళిత, దళిత (అహింద) వర్గాలకు అనుకూలమని మేమంతా సిద్దరామయ్యకు అనుకూలమని సమితి కన్వీనర్ అనిల్ జైహింద్ అన్నారు.

● కాగా రెండు రోజుల సమావేశంలో మాజీ సీఎంలు అశోక్ గెహ్లాట్, భూపేశ్ భాగేల్, వీ నారాయణస్వామిలతోపాటు రాష్ట్రానికి చెందిన బీకే హరిప్రసాద్, వీరప్పమొయిలీ, కమలేశ్వర్ పటేల్, అజయ్ కుమార్ లల్లు, హనుమంతరావు, ఆదూరు ప్రకాశ్, సుభాషిని యాదవ్, సమితి కార్యదర్శి జితేంద్ర భాగేల్‌తోపాటు పలువురు పాల్గొన్నారు. ప్రత్యేక ఆహ్వాన కమిటీలో భాగంగా తెలంగాణ నుంచి మంత్రులు కొండా సురేఖ, శ్రీహరి వాకిటి, పొన్నం ప్రభాకర్, అనిల్ యాదవ్, మాజీ మంత్రి మధుగౌడ యాష్కి సహా పలువురు పాల్గొన్నారు. బుధవారం మధ్యాహ్నంతో సభ ముగిసింది. ఈనెల 25న కాంగ్రెస్ ఓబీసీ సమితి సమావేశం ఢిల్లీలో జరగనుందని సమితి కన్వీనర్ అనిల్ జైహింద్ ప్రకటించారు. కాగా తొలిరోజు సభలో ఉత్సాహంగా పాల్గొన్న ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ రెండో రోజు దూరంగా ఉన్నారు.

రెండేళ్లుగా క్వార్టర్స్ ఇవ్వలేదు

● ప్రభుత్వంపై విరుచుకుపడ్డ ప్రతిపక్షనేత అశోక్



బెంగళూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): ప్రతిపక్షనేతగా రెండేళ్లుగా కొనసాగుతున్నా క్వార్టర్స్ కేటాయించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని రాష్ట్ర కాంగ్రెస్ పాలకులకు ప్రోటోకాల్ గురించి మాట్లాడే అర్హత లేదని ప్రతిపక్షనేత ఆర్ అశోక్ మండిపడ్డారు. బెంగళూరులో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ శివమొగ్గ జిల్లా సిగందూరులో కేబుల్ బ్రిడ్జ్ నిర్మించిన ఘనత బీజేపీకి దక్కుతుందని ఖంగుతిన్న ముఖ్యమంత్రి వివాదం చేస్తున్నారన్నారు. ప్రతిపక్షనేత హోదా రాజ్యాంగబద్ధమైనదని అన్ని సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందన్నారు. ఇప్పటివరకు 6 సార్లు లేఖ రాశానని, క్వార్టర్స్ ఎలా ఉన్నా కనీసం వివరణ కూడా ఇవ్వడం లేదన్నారు. సిగందూరు బ్రిడ్జ్ ప్రారంభానికి ముఖ్యమంత్రిని ఆహ్వానించారన్నారు. కానీ ఆయనకు ముందస్తు కార్యక్రమాల నిర్ణయంతో వెళ్లలేదన్నారు. రాష్ట్రప్రభుత్వం ఎక్కడైనా ప్రతిపక్ష నాయకులు, ఎమ్మెల్యేల సలహాలు లేదా కార్యక్రమాలలో పాల్గొనేలా అవకాశం కల్పించారా? అని ప్రశ్నించారు. రెండేళ్లకాలంలో ప్రతిపక్షనేతగా నన్ను ఒక్క కార్యక్రమానికి కూడా పిలవలేదన్నారు.

రాష్ట్రంలో రణదీప్ సుర్జేవాలా పాలన

రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్దరామయ్య పాలనపై సంపూర్ణంగా విశ్వాసం కోల్పోయారని, ఆయన లాటరీ దక్కినట్టుగా హోదా వచ్చిందని అందుకే కాంగ్రెస్ అధిష్ఠానం రాష్ట్రంలో రణదీప్‌సింగ్ సుర్జేవాలా పాలన అమలుకు సిద్ధమైందని ప్రతిపక్షనేత అశోక్ మండిపడ్డారు. బుధవారం ఎక్స్ వేదికగా పలు అంశాలు ప్రస్తావించారు. మంగళవారం 11మంది కాంగ్రెస్ మంత్రులను సుర్జేవాలా సభ జరిపిన అంశంపై మండిపడ్డారు. గురువారం కేబినెట్ భేటీకి సుర్జేవాలా అధ్యక్షత వహిస్తారా..? అంటూ ఎద్దేవా చేశారు. కేపీసీసీ కార్యాలయం, స్టార్ హోటళ్లలో అసంతృప్తి ఎమ్మెల్యేలు పలు అంశాలు సుర్జేవాలాకు తెలిపారన్నారు. మంత్రుల సాధనలు ఆలకించే సుర్జేవాలా కేబినెట్ భేటీకి అధ్యక్షత వహించినా ఆశ్చర్యం ఏమీ లేదన్నారు. సిద్దరామయ్యకు పాలనపై పట్టులేదని ఆరోపించారు. డీసీఎం డీకే శివకుమార్‌కు ఎమ్మెల్యేల మద్దతు లేదని, తమకు అనుకూలమైనవారిని ముఖ్యమంత్రిగా నియమించేందుకు రాహుల్‌కు శక్తి లేదని వ్యంగ్యం చేశారు. కాంగ్రెస్ పార్టీలో ముఖ్యమంత్రి స్థానాన్ని సమర్థవంతంగా నిర్వహించే ఒక నాయకుడు కూడా లేకుండా పోయాడని, హైకమాండ్ త్రిశంకుస్వర్గంలోకి చేరిందన్నారు.

మీపై ఫిర్యాదులకు సమాధానం చెబుతారా..?

● మంత్రులను నిలదీసిన సుర్జేవాలా



సమావేశంలో పాల్గొన్న సుర్జేవాలా, సీఎం తదితరులు

బెంగళూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): నాయకత్వ మార్పు అంశం తెరపైకి వచ్చినప్పటి నుంచి ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ రణదీప్‌సింగ్ సుర్జేవాలా బెంగళూరులోనే మకాం వేశారు. 15రోజుల వ్యవధిలో మూడు విడతలలో 9 రోజులపాటు బెంగళూరులో గడిపారు. మంత్రులు, ఎమ్మెల్యేలతో ప్రత్యేకంగా సమావేశమై అభివృద్ధితోపాటు ఇతరత్రా సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. మంగళవారం ఏకంగా 11మంది మంత్రులతో చర్చలు జరిపారు. మాకు వ్యతిరేకత లేదని, పార్టీ, ప్రభుత్వాన్ని సమన్వయం చేసుకుంటున్నామని పలువురు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. దీంతో సుర్జేవాలా ఒకింత ఆగ్రహానికి లోనైనట్టు తెలుస్తోంది. ప్రధానంగా మంత్రి దినేశ్ గుండూరావు, ప్రియాంక ఖర్గే, బోసరాజు, శరణప్రకాశ్ పాటిల్, మధుబంగారప్ప, ఎస్ఎస్ మల్లికార్జున, వెంకటేశ్, డీ సుధాకర్, లక్ష్మీ హెబ్బాళ్కర్‌లతో చర్చలు జరిపిన వేళ వారిపై వచ్చిన ఆరోపణలను, ఫిర్యాదులను ప్రస్తావించినట్టు తెలుస్తోంది. ఇక కియోనెక్స్ ఛైర్మన్ శరత్ బచ్చేగౌడ, కేఎస్ఐసీ అధ్యక్షురాలు ఖనీజా ఫాతిమా, కాలుష్య నియంత్రణమండలి ఛైర్మన్ నరేంద్రస్వామి సహా పలువురితో చర్చలు జరిపారు. ప్రజాపనులశాఖలో సొంత పార్టీ ఎమ్మెల్యేలు బిల్లులు క్లియర్ కావడం లేదనే అంశం కూడా చర్చకు వచ్చినట్టు తెలుస్తోంది. కాగా ఎమ్మెల్యేలు, మంత్రులను ఒక్కొక్కరిగా రప్పించుకుని సుర్జేవాలా సభలు జరపడాన్ని ప్రతిపక్ష బీజేపీ తీవ్రంగా అభ్యంతరం తెలిపింది. సుర్జేవాలా షాడో సీఎం అంటూ సోషల్ మీడియాలో పోస్టింగ్ హల్‌చల్ అయ్యింది. అందుకు మంత్రులు తిప్పికొట్టే ప్రయత్నం చేశారు.

వైద్యవిద్యాశాఖ మంత్రి శరణప్రకాశ్ పాటిల్ మాట్లాడుతూ మా శాఖకు సంబంధించిన రెండేళ్ల ప్రగతిని వివరించానని, పెండింగ్ పనులను ప్రస్తావించానన్నారు. ఇది మౌల్యమాపనం కాదని, నా పనితీరు పట్ల సుర్జేవాలా సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. గృహ నిర్మాణశాఖ మంత్రి జమీర్ అహ్మద్ కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇక కార్మికశాఖ మంత్రి సంతోష్‌లాడ్ స్పందిస్తూ రెండేళ్లుగా మా శాఖలో సాధన నివేదికను సుర్జేవాలాకు సమర్పించానన్నారు.

11న చలో విధానసౌధ



మాట్లాడుతున్న దళిత సమాజసేన రాష్ట్ర అధ్యక్షుడు సూలికుంటె ఆనంద్

బంగారపేట, జూలై 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఎస్సీ, ఎస్టీ సామాజికవర్గాల బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయడంలో నిర్లక్ష్యం చేయడాన్ని నిరసిస్తూ ఆగస్టు 11న చలో విధానసౌధ చేపడుతున్నట్టు కర్ణాటక దళిత సమాజసేన రాష్ట్ర అధ్యక్షుడు సూలికుంటె ఆనంద్ తెలిపారు. బుధవారం పట్టణంలోని అంబేడ్కర్ భవనంలో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలోని అనేక శాఖలలో 4వేల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నప్పటికీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయడం లేదన్నారు. దీంతో నిరుద్యోగులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలలో డిగ్రీ చేసిన వారు ఎంతోమంది ఉన్నారన్నారు. సంవత్సరాల తరబడి ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పలుమార్లు విన్నవించినా ప్రయోజనం లేకపోవడంతో ఈసారి భారీ నిరసన చేపట్టదలిచామన్నారు. అవుట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఉద్యోగులను ఇష్టం వచ్చినట్టు తొలగిస్తున్నారని, ఈ విధానానికి బ్రేక్ వేయాలన్నారు. మీడియా సమావేశంలో కర్ణాటక దళిత సమాజసేన సభ్యులు అయ్యప్ప, హిరేకరప్పనహళ్ళి అశోక్, ఆటో కర్ణ, ప్రదీప్, రవి, అర్జున్, రాజేశ్, మిట్టగానహళ్ళి మంజు పాల్గొన్నారు.

రౌడీషీటర్ హత్య కేసు...

బీజేపీ ఎమ్మెల్యే బైరతి బసవరాజ్‌పై ఎఫ్ఐఆర్



బెంగళూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): భారతినగర్ ప్రాంతంలో రౌడీషీటర్ శివప్రకాశ్ అలియాస్ బిట్లు శివ హత్య కేసులో బీజేపీ ఎమ్మెల్యే బైరతి బసవరాజ్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. మంగళవారం రాత్రి భారతినగర్‌లో కారులో వచ్చిన వ్యక్తులు హత్య చేశారనే ఆరోపణలు ఉన్నాయి. మృతుడి తల్లి విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. శివప్రకాశ్‌పై ఏడెనిమిదిమంది రాడ్‌లు, వేటకొడవళ్లతో దాడిచేసి హత్య చేశారని అతడి మిత్రుడు అడ్డుకునేందుకు వెళ్తే అతడిపైనా దాడి చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. తాను కేకలు వేయడంతో గుర్తు తెలియని వ్యక్తులు కారులో పరారీ అయ్యారన్నారు. వారిలో కొందరిని గుర్తించగలనని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. శివప్రకాశ్‌పై 11 కేసులు ఉండగా 2006లో రౌడీషీట్ తెరిచారు. కాగా ఐదో నిందితుడిగా బైరతి బసవరాజ్ పేరు నమోదు చేశారు. మిగిలినవారిలో జగదీశ్, కిరణ్, విమల్, అనిల్ ఉన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 11న జగదీశ్, కిరణ్‌లు కిత్తగనూరులో శివప్రకాశ్ ఆస్తిని ఆక్రమించుకున్నారని అప్పటినుంచే వివాదం తలెత్తినట్టు ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు.



జోరువానలో ఇబ్బందులు పడుతున్న జనం



ఆర్‌టీ నగర్‌లో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

కానొచ్చిందోచ్..!

బెంగళూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఇటీవల కొన్ని రోజులుగా వరుణుడు కనుమరుగైనట్టు అనిపించింది. కానీ బుధవారం సాయంత్రం నగరవ్యాప్తంగా వాన వచ్చింది. సాయంత్రం విద్యాసంస్థలు వదిలేవేళ ఓ మోస్తరు వర్షం కురిసింది. సాయంత్రం విద్యార్థులు, ఉద్యోగులు వర్షంతో ఇబ్బంది పడ్డారు. బస్సులకోసం వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ద్విచక్రవాహనాలపై వెళ్లేవారు తడిసి ముద్దయ్యారు. పాదచారులు గొడుగులతో ముందుకు సాగారు.

మాదకద్రవ్యాలను అరికట్టాలి: సీఎం



కేఎస్ఆర్‌పీ భవన సముదాయ ప్రారంభోత్సవంలో సీఎం తదితరులు

బొమ్మనహళ్ళి, జూలై 16(ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలను పూర్తిగా అరికట్టాలని, పోలీసులు సమర్థవంతంగా వ్యవహరించాలని సీఎం సిద్దరామయ్య సూచించారు. బుధవారం సిల్క్‌బోర్డ్ ప్రాంతంలో కేఎస్ఆర్‌పీ సముదాయభవనాన్ని సీఎం ప్రారంభించి మాట్లాడారు. నగరంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా మాదకద్రవ్యాలు లేకుండా చేయాలన్నారు. మాదకద్రవ్యాల వల్ల యువత పెడదోవపడుతున్నారన్నారు. మరోవైపు సైబర్ నేరాల వల్ల ఎంతోమంది నష్టపోతున్నారని విచారం వ్యక్తం చేశారు. అధికారులు, పోలీసులు కలిసికట్టుగా కార్యాచరణ చేపట్టడం ద్వారా నేరాల నియంత్రణ సాధ్యమన్నారు. గతంతో పోలిస్తే నేరాల సంఖ్య తగ్గాయన్నారు. పోలీసులు ప్రజలతో స్నేహ సోదరభావంతో మెలగాలని సూచించారు. మహిళల సమస్యలకోసం ప్రత్యేక స్టేషన్‌లను ఏర్పాటు చేశామని, బాధితులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోలీసుశాఖ బలోపేతానికి రూ.500 కోట్ల గ్రాంట్లు విడుదల చేశామన్నారు. త్వరలోనే పాత టోపీ విధానాన్ని మార్చి, పి క్యాప్‌లను సిబ్బందికి ఇవ్వనున్నట్టు తెలిపారు. నగరంలో 8 డివిజన్లను 11 డివిజన్లకు పెంచామన్నారు. హోం మంత్రి పరమేశ్వర్ మాట్లాడుతూ పోలీసుశాఖ సమర్థవంతంగా పనిచేయడం ద్వారానే సమాజంలో శాంతిభద్రతలు సాధ్యమన్నారు. కర్ణాటక రాష్ట్రానికి 10లక్షలకోట్లు పెట్టుబడులు వచ్చాయంటే రాష్ట్రంలో అన్ని విభాగాలు సజావుగా కొనసాగుతుండడమే కారణమని ప్రత్యేకించి పోలీసుశాఖ దేశంలో నెంబరువన్‌గా ఉందన్నారు. పోలీసులకు ఇప్పటికే 25వేల ఇళ్లు నిర్మించామన్నారు. ఆవతి, కేజీఎఫ్‌లలో చెరొక బెటాలియన్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ సముదాయ భవనంలో చేపట్టే కార్యక్రమాల్లో పోలీసులకు రాయితీ ఉంటుందన్నారు. బీఎంఆర్‌సీఎల్ రూ.40కోట్లతో ఈభవనం నిర్మించిందన్నారు. కార్యక్రమంలో రవాణాశాఖ మంత్రి రామలింగా రెడ్డి, బీఎంఆర్‌సీఎల్ ఎండీ ఉమామహేశ్వరరావు, డీజీపీ సలీం, మాలిని కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అటల్ జూకు కొత్త అతిథి

● మగ హిప్పోపొటమస్ రాక



జూలోకి వచ్చిన మగ హిప్పోపొటమస్

హొస్పేట, జూలై 16(ఆంధ్రజ్యోతి): కల్యాణ కర్ణాటక డివిజన్‌లో ఏకైక సఫారీ ఉన్న కమలాపుర్‌లోని అటల్ బిహారీ వాజ్‌పేయి జూలాజికల్ పార్క్‌కు బుధవారం మంగళూరులోని పిలికుల బయోలాజికల్ పార్క్ నుంచి చింటు అనే మగ హిప్పోపొటమస్ అతిథిగా వచ్చింది. జూకు ఎక్కువ మంది పర్యాటకులను ఆకర్షించడానికి పర్యాటకులు మరిన్ని జంతువులను చూడటానికి వీలుగా జంతు మార్పిడి కార్యక్రమం కింద మంగళూరులోని పిలికుల బయోలాజికల్ పార్క్ నుంచి మగ నీటి ఏనుగును అప్పగించడానికి న్యూఢిల్లీలోని సెంట్రల్ జూ ఆథారిటీ అనుమతి ఇచ్చింది. చింటు అనే 6 సంవత్సరాల మగ హిప్పోపొటామస్ కొత్త అతిథి వచ్చిందని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తెలిపారు.



నిరసన తెలుపుతున్న వ్యాపారులు

బాబోయ్..
యూపీఐ పేమెంట్‌లు వద్దు..!

● 65వేల మంది వ్యాపారుల్లో 5,684 మందికి నోటీసులు

● మాయమవుతున్న క్యూఆర్ కోడ్ బోర్డులు ● 23 నుంచి రెండు రోజుల నిరసన: వ్యాపారులు



బెంగళూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): డిజిటల్ సాంకేతికం ద్వారా ఆర్థిక వ్యవహారాలు పెరిగాయి. రూ5 నుంచి రూ.50వేలు అయినా సెకన్లలో స్కాన్ చేసి చెల్లించే విధానం వచ్చేసింది. యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేజ్ (యూపీఐ) పేమెంట్‌లు దేశంలోనే మరో సాంకేతిక మైలురాయికి నిర్దేశమని కేంద్రం ప్రకటించింది. పదేళ్లకిందట అక్కడక్కడ మాత్రమే కనిపించిన యూపీఐ పేమెంట్ల విధానం ఇటీవల అన్నింటికీ విస్తరించింది. చివరకు పే అండ్ యూజ్ టాయ్‌లెట్‌లో కూడా స్కాన్ చేసి చెల్లిస్తున్నారు. కొందరు బిచ్చగాళ్లు సైతం చిల్లర లేదంటే స్కాన్ చేయాలంటూ సరదా అనిపించినా.... పలుచోట్ల ఇది అమలైంది. జేబులో వంద పెట్టుకుంటే వారం రోజులైనా గడిపేయవచ్చుననే విధానానికి ప్రజలు అలవాటు పడ్డారు. నోట్ల చలామణి బాగా తగ్గిపోయింది. ఏటీఎం కేంద్రాలు గణనీయంగా తగ్గించేశారు. వేలల్లో ఉన్న ఏటీఎంలు వందలకు చేరుతున్నాయి. పైగా బ్యాంక్ ఆన్‌సైట్ ఏటీఎంలలోనూ డబ్బులు లేని పరిస్థితి కొనసాగింది. కేంద్రప్రభుత్వం డిజిటల్ పరిజ్ఞానానికి ప్రజలు అలవాటు పడ్డారని కొనియాడారు. వ్యాపారులు చిల్లర సమస్య ఉండదని అన్నింటికీ క్యూఆర్ కోడ్ ద్వారానే లావాదేవీలు చేశారు. చివరకు ఆర్టీసీ బస్సులలోనూ టిక్కెట్లకు యూపీఐ విధానం అమలు చేస్తున్నారు. ఇలా సాగుతున్న తరుణంలోనే వాణిజ్యపన్నుల శాఖ నిబంధనలు విధించింది.

వ్యాపారులపై జీఎస్టీ పిడుగు

ఏడాదికి 40 లక్షల రూపాయలకంటే వ్యాపారాలు చేసిన బేకరీలు, హోటళ్లు, బడ్డీకొట్లతోపాటు ఇతరత్రా దుకాణాలను గుర్తించి జీఎస్టీ చెల్లించాలని హెచ్చరిస్తూ నోటీసులు జారీ చేసింది. యూపీఐ ద్వారా లావాదేవీలు జరిపే చిన్న వ్యాపారులను గుర్తించి నోటీసులు ఇచ్చే ప్రక్రియ గుజరాత్‌లో తొలిసారిగా ప్రారంభించారు. 2024 ఆగస్టులోనే వ్యాపారులకు నోటీసులు ఇచ్చారు. ఆ తర్వాత ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌లోనూ వేలాదిమందికి ఇదే తరహా నోటీసులు ఇచ్చారు. ఇక రాష్ట్రంలోనూ వ్యాపారాలు అత్యధికంగా చేసినవారికి నోటీసులు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. ప్రతి వ్యాపారికి సంబంధించిన లావాదేవీలను జీఎస్టీ విభాగం పరిశీలన చేస్తోంది. వ్యాపారులు కూడా సులభతరంగా పని జరుగుతోందని క్యూఆర్ కోడ్‌లను బ్యాంకుకు ఒకటి రెండు చొప్పున తీసేసుకున్నారు. బెంగళూరు బళేపేటలోని ఒక అంగడికి 9 యూపీఐ ఐడీలు ఉపయోగించారు. ప్రతి ఐడీలోనూ 20లక్షల రూపాయలకంటే ఎక్కువ వ్యాపారం చేశారు. ఈ లెక్కన ఒక్క దుకాణంలోనే ఏడాదికి కోటిన్నర రూపాయలకు పైగా లావాదేవీలు జరిగినట్టు తెలుస్తోంది.

వ్యాపారుల్లో వణుకు..

రాష్ట్రంలో 65వేలమంది వ్యాపారులు యూపీఐ కోడ్ ద్వారా లావాదేవీలు జరిపారు. వీరిలో 20లక్షల రూపాయలు చేసినవారు 50వేలమంది ఉన్నారు. రూ.40లక్షలు కంటే ఎక్కువ లావాదేవీలు చేసినవారు 14వేల మంది ఉండగా, రూ.80లక్షలు లావాదేవీలు చేసినవారు 900మంది ఉన్నారు. రూ.2కోట్ల లావాదేవీలు చేసినవారు 150మంది ఉన్నట్టు గుర్తించారు. 2021-22 నుంచి వరుసగా నాలుగేళ్ల ఏ పాన్ నెంబరుకు అనుబంధమైన బ్యాంకు ఖాతా రూ.40లక్షలకంటే ఎక్కువ లావాదేవీలు సాగాయో వారిని గుర్తించి నోటీసులు ఇస్తున్నట్టు వాణిజ్యపన్నులశాఖ అదనపు కమిషనర్ తెలిపారు. 5,684మందికి నోటీసులు జారీ చేశారు. రూ.40లక్షల కంటే ఎక్కువ వ్యాపారాలు చేసిన వారికి నోటీసులు జారీ చేశారు. ఈ ప్రక్రియ ప్రారంభం కాగానే వ్యాపారులలో వణుకు పట్టుకుంది. అయితే నోటీసులు తీసుకున్నవారు కార్యాలయానికి వచ్చి సంప్రదిస్తే వివరాలు ఇస్తామని అధికారులు అంటున్నారు.

25న రాజధానిలో భారీ నిరసన

వ్యాపారులు, రాష్ట్ర కార్మిక పరిషత్‌తో కలసి మంగళవారం నగరంలో భారీ నిరసన చేపట్టారు. వేలాదిమంది నిరసనలో భాగస్వాములై కేంద్ర ప్రభుత్వ తీరును తప్పుబట్టారు. వెంటనే సడలించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఈనెల 23నుంచి రెండురోజులపాటు రాష్ట్రమంతటా బంద్ చేస్తామని హెచ్చరించారు. మంగళవారం జరిగిన సన్నాహకసభలో రాష్ట్ర కార్మిక పరిషత్ అధ్యక్షుడు రవిశెట్టి బైందూరు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రెండురోజులు బంద్ చేపట్టి 25న బెంగళూరులో భారీ నిరసన తెల్పుతామన్నారు. ఒక్కసారిగా లక్షలాదిరూపాయల పన్నులు చెల్లించాలని నోటీసులు జారీ చేస్తే చిన్న వ్యాపారుల పరిస్థితి ఏం కావాలని ప్రశ్నించారు. జాతీయ డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు గండసి సదానందస్వామి మాట్లాడుతూ వ్యాపారం జరిగిందంటే అంతా లాభమే ఉండదన్నారు. 5 నుంచి ఆరేడుశాతం లాభం ఉండవచ్చునన్నారు. ఏడాదికి 40లక్షల వ్యాపారం అంటే రూ.2లక్షల లాభం ఉండవచ్చునని ఆ సొమ్ముతో కుటుంబం జీవనం సాధ్యమా అని ప్రశ్నించారు. కన్నడ సంఘాల సమాఖ్య అధ్యక్షుడు నటరాజ్ బొమ్మసంద్ర, సుబ్రమణ్య, గోవిందబాబు పూజారి తదితరులు పాల్గొన్నారు. 23నుంచి రెండురోజులపాటు బేకరీలు, చిన్నవ్యాపారులు పూర్తిగా దుకాణాలు మూసివేయనున్నట్టు వెల్లడించారు.

మాయమవుతున్న క్యూఆర్ కోడ్‌లు

వ్యాపారులకు జీఎస్టీ నోటీసులు జారీ కావడంతో వ్యాపారులలో భయం పట్టుకుంది. అప్పుడే క్యూఆర్‌కోడ్ ప్లేట్‌లను మాయం చేస్తున్నారు. దుకాణాల వద్ద అంటించిన స్టిక్కర్‌లను తొలగిస్తున్నారు. ఏదైనా వస్తువు కొనుగోలు చేస్తే క్యూఆర్‌కోడ్‌తో చెల్లింపు అంటే సాధ్యంకాదని తెగేసి చెబుతున్నారు. మరోవైపు ఇదే చివరి అవకాశం అని మరోసారి నగదు లేకుండా వ్యాపారానికి రావద్దంటూ తెగేసి చెబుతున్నారు.

రహదారిపై యువకుడి మృతదేహం

ఛిద్రమైన తల, మొండెం

రోడ్డు ప్రమాదమా..? చంపి పడేశారా..?

బుక్కరాయసముద్రం, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతపురం-అమరావతి హైవేపై (544డి) గుర్తుతెలియని యువకుడు బుధవారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని బోయకొట్టాల గ్రామ శివారులో రహదారిపై 25 నుంచి 30 ఏళ్లలోపు యువకుడి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. యువకుడి చేతిపై సినీ హీరో అల్లుఅర్జున్ ఐకాన్ ఏఏ టాటూ వేయించుకున్నాడని, మరో చేతిపై ఎస్ అనే అక్షరం ఉందని పోలీసులు తెలిపారు. అతడి మొండెం తెగిపోవడం, మొహం ఛిద్రం కావడంతో గుర్తుపట్టని విధంగా ఉన్నాడు. గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందాడా? ఎవరైనా హత్య చేసి రోడ్డుపై పడేసి వెళ్లారా.. అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. మంగళవారం రాత్రి జరిగి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతుడు ఆ సమయంలో నడిచి ఎందుకు వచ్చాడని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బుక్కరాయసముద్రం పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



చిగిచెర్ల నారాయణ(ఫైల్)

నార్పల, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గడ్డం నాగేపల్లికి చెందిన రైతు చిగిచెర్ల నారాయణ(64) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. నారాయణకు రెండున్నర ఎకరాల పొలం ఉంది. ఐదేళ్ల నుంచి అరటి, మిరప సాగు చేస్తూ నష్టపోయాడు. పెట్టుబడికి తెచ్చిన అప్పులు రూ.8 లక్షలు, దానిపై వడ్డీ తీర్చలేకపోయారు. ఈ ఒత్తిడితో ఈ నెల 10న ఇంట్లో పురుగుల మందు తాగారు. కుటుంబ సభ్యులు అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, కోలుకోలేక బుధవారం మృతిచెందారు. ఆయనకు భార్య సుశీలమ్మ, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సాగర్ తెలిపారు.

ఒకే రోజు 10 ఇళ్లలో చోరీ



దొంగతనానికి ఉపయోగించిన కడ్డీ

పుట్టపర్తి రూరల్, జూలై 16(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఒకే రోజు పది ఇళ్లలో చోరీలు జరిగాయి. బుధవారం తెల్లవారుజామున శ్రీసత్యసాయి సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి స్టాఫ్ క్వార్టర్స్‌లో 10 ఇళ్లలో భారీఎత్తున నగదు, బంగారు నగలను అపహరించారు. రాత్రి విధులు ముగించుకుని ఉదయం ఇంటికి వచ్చిన సిబ్బంది తమ ఇళ్లు, బీరువాల తాళాలను దుండగులు పగులగొట్టినట్లు గుర్తించారు. తమ ఇళ్లలో చోరీ జరిగిందని నిర్ధారించుకుని పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు డ్యాగ్‌స్వాడ్‌తో అక్కడకు చేరుకుని క్షుణ్ణంగా పరిశీలించారు. అక్కడ ఉన్న సీసీటీవీ పుటేజీలను పరిశీలించారు. దుండగులు చోరీకి పాల్పడిన ప్రాంతానికి సమీపంలో కలెక్టర్ బంగ్లా కూడా ఉండటం గమనార్హం. నిరంతరం సెక్యూరిటీ ఉండే ప్రాంతంలో భారీ చోరీ జరగడంతో పోలీసుల పనితీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదే తరహాలో గత ఏడాది పట్టణానికి సమీపంలోని సందీప్‌విల్లాలో కూడా రెండు ఇళ్లలో చోరీకి పాల్పడిన దుండగులు భారీగా బంగారు నగలు అపహరించుకుపోయారు. నేటికీ ఆ కేసును పోలీసులు ఛేదించలేకపోయారు. భారీ దొంగతనం జరగడం పట్ల స్థానికులు ఆందోళన చెందుతున్నారు. రాత్రిపూట గస్తీ పెంచాలని కోరుతున్నారు. ఈ ఘటనపై రూరల్ ఎస్సై లింగన్నను వివరణ కోరగా బంగారు నగలు, నగదు ఎంత చోరీ అయ్యిందో ఎవరూ ఫిర్యాదు చేయలేదన్నారు. చోరీ సమాచారంపై తాము ప్రత్యేక బృందాల పర్యవేక్షణలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పాముకాటుతో మహిళా రైతు మృతి



సువర్ణమ్మ (ఫైల్)

ముదిగుబ్బ, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్ధన్నగారిపల్లి లో పాముకాటుతో మహిళా రైతు సువర్ణమ్మ(44) బుధవారం మృతి చెందినట్లు ఏఎస్ఐ నాగభూషణం పేర్కొన్నారు. ఆయన తెలిపిన మేరకు సిద్ధన్నగారిపల్లికి చెందిన శివారెడ్డి భార్య సువర్ణమ్మ భర్తతో కలిసి చీనీ తోటలో కలుపు తీస్తుండగా చేతికి పాము కాటేసింది. వెంటనే ప్రైవేటు వాహనంలో బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షిస్తుండగా ఆమె మృతి చెందారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

తమ్ముడూ..! అమ్మ జాగ్రత్త

● వీడియో కాల్ చేసి.. అన్న ఆత్మహత్య



రేవంత్‌కుమార్ (ఫైల్)

గుత్తి రూరల్/ పెబ్బేరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): తమ్ముడూ అమ్మ జాగ్రత్త... అంటూ ఒక అన్న వీడియో కాల్ చేసి ఆత్మహత్య చేసుకున్న సంఘటన వనపర్తి జిల్లా పెబ్బేరు మండలంలో చోటుచేసుకున్నది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలను ఎస్సై గంగిరెడ్డి యుగేందర్ రెడ్డి బుధవారం తెలిపారు. అనంతపురం జిల్లా గుత్తి మండలం పి కొత్తపల్లి గ్రామానికి చెందిన సూర్యనారాయణకు రేవంత్ కుమార్ (27), కిరణ్ కుమార్ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. ఐదేళ్ల కిందట తండ్రి మృతి చెందటంతో పెద్ద కుమారుడు రేవంత్ కుమార్ ఇంటి బాధ్యతలను చూసుకుంటున్నాడు. గుత్తి మార్కెట్ నుంచి తన బొలెరో వాహనంలో పచ్చిమిర్చిని తీసుకొని నిజామాబాద్‌కు బయలుదేరాడు. మంగళవారం సాయంత్రం వనపర్తి జిల్లా పెబ్బేరు మునిసిపాలిటీ సమీపంలోని కొత్తకోట బైపాస్ జాతీయ రహదారిపై తన వాహనాన్ని నిలిపాడు. తన తమ్ముడు కిరణ్ కుమార్‌కు వీడియో కాల్ చేసి తను చేసిన అప్పుల వివరాలు నోట్‌బుక్‌లో ఉన్నాయని, భూమి అమ్మి అందరి అప్పులు చెల్లించాలని కోరాడు. ఇక నుంచి ఇంటి బాధ్యతతో పాటు అమ్మను జాగ్రత్తగా చూసుకోవాలని, తాను చనిపోతున్నానంటూ వీడియో కాల్‌లో మాట్లాడుతూ పురుగుల మందు తాగాడు. అన్న మొబైల్ లోకేషన్ పరిశీలించగా పెబ్బేరులో ఉన్నట్లు తెలిసింది. దీంతో సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడి తమ్ముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలి

● కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం కలెక్టరేట్, జూలై 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పక్కాగా పాటించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. ప్రమాదాలకు తావివ్వకుండా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పరిశ్రమల్లో కార్మికుల భద్రతకు ప్రాధాన్యమివ్వాలన్నారు. జిల్లాలోని అన్ని పరిశ్రమలను 15రోజుల్లోగా సంబంధిత అన్ని శాఖల అధికారులు తనిఖీ చేసి, నివేదిక ఇవ్వాలన్నారు. తనిఖీ విషయంలో అలసత్వం ఉండరాదన్నారు. ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీల పరిష్కారానికి తహసీల్దార్ క్షేత్రస్థాయిలోకి వెళ్లాలన్నారు. అభివృద్ధి పనులకు భూసేకరణ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. సమావేశాల్లో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మార్గదర్శకుల గుర్తింపు వేగవంతం చేయాలి

అనంతపురం కలెక్టరేట్, జూలై 16(ఆంధ్రజ్యోతి): పీ4 అమలులో భాగంగా మార్గదర్శకుల గుర్తింపును వేగవంతం చేయాలనీ, లక్ష్యాన్ని అధిగమించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి పీ4 కార్యక్రమంపై ఆయా శాఖల జిల్లా అధికారులు, నియోజకవర్గ ప్రత్యేకాధికారులు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. పీ4 కింద జిల్లాలో 68,381 బంగారు కుటుంబాలను గుర్తించామన్నారు. ఇందులో దాతల (మార్గదర్శకుల)కు ఇప్పటివరకు 18,396 మందిని దత్తత ఇచ్చామన్నారు. ఇంకా 45,985 మంది బంగారు కుటుంబాలను దత్తత ఇవ్వాల్సి ఉందన్నారు. ఇందు కోసం మార్గదర్శకులను గుర్తించాలనీ, ఈ విషయంలో అవగాహన కల్పించాలని కలెక్టర్ వివరించారు.

ఫుల్లు కిక్కు..!

భారీగా పెరిగిన మద్యం విక్రయాలు

తొలి త్రైమాసికంలో రికార్డు స్థాయిలో అమ్మకాలు

గతేడాది కంటే 92 శాతం అధికం

161.66 శాతం పెరిగిన బీర్ల విక్రయాలు

బ్రాండెడ్ అందుబాటులోకి రావడం, ధరలు తగ్గడమే కారణం



“ వైసీపీ పాలనలో పెగ్గు వేయాలంటే మద్యంబాబులు బెంబేలెత్తేవారు. బూమ్.. బూమ్.. అంటూ రకరకాల అనామక పేర్లతో మద్యం సరఫరా చేసేవారు. ధరలు మాత్రం ఆకాశాన్ని తాకేవి. విధిలేని పరిస్థితుల్లో ఆ నాసిరకం మద్యం తాగిన ఎంతోమంది ఆస్పత్రులు పాలయ్యారు. వారిలో చాలా మంది దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడి మంచానికే పరిమితమయ్యారు. కొందరు చనిపోయారు కూడా. దీంతో ఆయా కుటుంబాలు పెద్దదిక్కును కోల్పోయి దిక్కుతోచని స్థితిలో పడ్డాయి. బతికిన వారికి కూడా ఆస్పత్రుల ఖర్చులకు ఆస్తులను అమ్ముకోవాల్సి వస్తోంది. వారు కూడా అన్నీ కోల్పోయి రోడ్డున పడ్డారు. దీంతో మందుబాబులు ఏపీ మద్యానికి భయపడి, పక్క రాష్ట్రాల నుంచి అక్రమంగా తెచ్చుకునేవారు. నాటుసారా విక్రయాలు కూడా విపరీతంగా సాగేవి. వెరసి.. ప్రభుత్వ మద్యం విక్రయాలు భారీగా పడిపోయాయి. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక బ్రాండెడ్ మద్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. ధరలను సైతం తగ్గించింది. దీంతో మద్యం ప్రియులు పక్క రాష్ట్రాల వైపు చూడాల్సిన అవసరం లేకుండా పోయింది. రూ.99కే ప్రీమియం క్వార్టర్ అందుబాటులోకి రావడంతో నాటుసారా విక్రయాలకు చెక్ పడింది. వెరసి.. ప్రభుత్వ మద్యం విక్రయాలు విపరీతంగా పెరిగియి. కర్ణాటక సరిహద్దులోని కంబదూరు, కళ్యాణదుర్గం ఎక్సైజ్ సర్కిళ్ల పరిధిలో జిల్లాలోనే అత్యధికంగా 2025-26 తొలి త్రైమాసికంలో బీర్ల విక్రయాలు సాగాయంటే కర్ణాటక మద్యానికి ఏ స్థాయిలో చెక్ పడిందో అర్థం చేసుకోవచ్చు. కాగా, మద్యం విక్రయాలు రికార్డు స్థాయిలో పెరిగినా.. ధరలు తగ్గించడంతో ప్రభుత్వానికి ఆదాయం కూడా పడిపోయింది. ”

అనంతపురం క్రైం, జూలై 16(ఆంధ్రజ్యోతి): పెగ్గు మీద పెగ్గెయ్... అంటూ మద్యంప్రియులు ఫుల్లుగా తాగేశారు. 2025-26 తొలి త్రైమాసికంలో మద్యం విక్రయాలు జోరుగా సాగాయి. గతేడాది త్రైమాసికం కంటే.. ఈసారి భారీగా పెరిగాయి. ఏప్రిల్, మే, జూన్ నెలల్లో ఏకంగా 6.74 లక్షల కేసుల మద్యం అమ్ముడైంది. ఇందులో లిక్కర్ 4.24 లక్షలు, బీర్ 2.50 లక్షల కేసులు విక్రయించారు. రమారమి రూ.302 కోట్ల విలువైన మద్యం సేల్స్ జరిగాయి.

తొలి త్రైమాసికంలో భారీగా...

అనంతపురం, గుత్తి, గుంతకల్లు, కళ్యాణదుర్గం, కంబదూరు, కణేకల్లు, రాయదుర్గం, శింగనమల, తాడిపత్రి, ఉరవకొండ ఎక్సైజ్ సర్కిళ్ల పరిధిలో ఈ ఏడాది ఏప్రిల్, మే, జూన్ నెలల్లో పెద్దఎత్తున లిక్కర్, బీర్ కేసులు విక్రయించారు. అనంతపురం ఎక్సైజ్ సర్కిల్ 2.15 లక్షల కేసులు అమ్ముడయ్యాయి. గతేడాది 3.51 లక్షల కేసుల మద్యం మాత్రమే విక్రయించారు. 2024 ఏప్రిల్, మే, జూన్ త్రైమాసికంలో లిక్కర్ 2.55 లక్షల కేసులు, బీర్ 95,631 కేసులు అమ్ముడయ్యాయి. మొత్తంగా 3.51 లక్షల లిక్కర్, బీర్ కేసులు విక్రయించారు. తద్వారా రూ.226.47 కోట్ల విలువైన మద్యం వ్యాపారం సాగింది. గతేడాది కంటే ఈసారి తొలి త్రైమాసికంలో భారీగా అమ్మకాలు పెరిగాయి. గతేడాది కంటే లిక్కర్ 66.03 శాతం, బీర్ 161.66 శాతం విక్రయాలు పెరగడం గమనార్హం. మొత్తంగా ఈ ఏడాది 92.08 శాతం అధికంగా విక్రయాలు సాగాయి.

బీర్లు పొంగించారు....

ఈ ఏడాది బీర్లు ఉప్పొంగాయి. యువత, మధ్యవయసు వారు భారీగా బీర్ల కొనుగోలుకు ఉత్సాహం చూపారు. గతేడాది 95,631 కేసులు మాత్రమే అమ్ముడు పోగా.. ఈసారి ఏకంగా 2.55 లక్షల కేసులు దాటించారు. అత్యధికంగా కంబదూరు సర్కిల్‌లో బీర్ల కొనుగోళ్లు ఊపందుకున్నాయి. గతేడాది కేవలం 915 కేసులు అమ్ముడు కాగా.. ఈసారి ఏకంగా 6,747 విక్రయాలతో జిల్లాలోనే అగ్రస్థానంలో నిలిచింది. తర్వాతి స్థానంలో శింగనమల నిలిచింది. శింగనమల సర్కిల్‌లో 247.68 శాతం, కళ్యాణదుర్గం 226.54 శాతం అమ్మకాలు జరిగాయి. అనంతపురం కూడా బీర్ల అమ్మకాల్లో ఈ మూడు సర్కిళ్ల కంటే వెనుకబడటం గమనార్హం. గతేడాది కంటే ఈసారి బీర్ల అమ్మకాలు 161.66 శాతం పెరిగాయని చెప్పవచ్చు.

జిల్లాలో తొలి త్రైమాసికంలో మద్యం, బీర్ల విక్రయాలు ఇలా..

సర్కిల్	మద్యం విక్రయాలు	బీర్ విక్రయాలు	మొత్తం విక్రయాలు	విలువ
అనంతపురం	1,21,155	94,284	2,15,439	రూ.96.65 కోట్లు
గుత్తి	42,652	24,761	67,413	రూ.30.04 కోట్లు
గుంతకల్లు	40,331	19,826	60,157	రూ.27.66 కోట్లు
కళ్యాణదుర్గం	32,115	18,273	50,388	రూ.21.99 కోట్లు
కంబదూరు	12,672	6747	19419	రూ.8.29 కోట్లు
కణేకల్లు	18,943	7,587	26,530	రూ.12.43 కోట్లు
రాయదుర్గం	34582	14793	49375	రూ.22.16 కోట్లు
శింగనమల	40484	25905	66393	రూ.28.45 కోట్లు
తాడిపత్రి	52492	26985	79477	రూ.36.67 కోట్లు
ఉరవకొండ	28573	11066	39639	రూ.18.38 కోట్లు
మొత్తం	4,23,999	2,50,231	6,74,230	రూ.302.78 కోట్లు

చరిత్రలో చిరస్థాయిగా చంద్రబాబు

నేడు హంద్రీనీవాకు నీటిని విడుదల చేయనున్న సీఎం

40 టీఎంసీలతో భవిష్యత్తుకు భరోసా

ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు

రాయలసీమ ద్రోహి వైఎస్ జగన్

టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్



మాట్లాడుతున్న కాలవ శ్రీనివాసులు

అనంతపురం క్రైం, జూలై 16(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువకు కృష్ణా జలాలు తేవడంతో సీఎం చంద్రబాబునాయుడు చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తారని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. సీఎం చేతుల మీదుగా మల్యాల వద్ద హెచ్ఎన్ఎస్ఎస్‌కు నీటి ఎత్తిపోతలను గురువారం ప్రారంభించనుండడం శుభపరిణామం అన్నారు. స్థానిక రాంనగర్‌లోని టీడీపీ కార్యాలయంలో బుధవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్‌తో కలిసి కాలవ మీడియా సమావేశం నిర్వహించారు. హెచ్ఎన్ఎస్ఎస్ ఎన్టీఆర్ ఆలోచన అన్నారు. దీని ఫలాలు, ఫలితాలు పూర్తిగా అనుభవించాలన్న తాపత్రయం సీఎం నారా చంద్రబాబునాయుడిదేనన్నారు. కాంగ్రెస్ హయాంలో కొంతమేర పనులు చేసినా.. విపరీతమైన అవినీతి, అక్రమాల కారణంగా ఫలాలు అందజేదన్నారు. 2014లో చంద్రబాబు సీఎం అయ్యాక హంద్రీనీవా పథకంలో కొత్త శకం ప్రారంభమైందన్నారు. అప్పట్లోనే రూ.2,700 కోట్లు ఖర్చు చేశారన్నారు. సీమ ప్రాజెక్టులకు రూ.12 వేల కోట్లు ఖర్చు చేస్తే... హెచ్ఎన్ఎస్ఎస్‌కు పెద్ద ఎత్తున నిధులు వెచ్చించి, ఒక దశకు తీసుకొచ్చారన్నారు. ఫలితంగా గొల్లపల్లి రిజర్వాయర్‌కు నీరు రావడంతోపాటు కియ ఫ్యాక్టరీ ఏర్పాటైందన్నారు. 2019-24 మధ్యలో జగన్ వల్ల ఈ పథకం మళ్లీ పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందన్నారు. ఐదేళ్లు ప్రగతి ఊసే లేదన్నారు. మళ్లీ చంద్రబాబు సీఎం అవడంతో హెచ్ఎన్ఎస్ఎస్ పనులు పరుగులు పెట్టించారన్నారు. కూటమి ఏడాది పాలనలోనే రూ.3 వేల కోట్ల పైచిలుకు నిధులతో కాలువ వెడల్పు, 2వ దశ పనులు చేపట్టారన్నారు. 3,850 క్యూసెక్కుల సామర్థ్యానికి పెంచడమే లక్ష్యంగా పనులు పూర్తి చేసింది చంద్రబాబునాయుడేనన్నారు. ఆయనే కాలువకు నీరు వదులుతుండడం ఆనందంగా ఉందన్నారు. అనంతపురం జిల్లా రైతుల పక్షాన సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. 5 దశాబ్దాల కింద 40 టీఎంసీల నీరు హెచ్ఎన్ఎస్ఎస్ ద్వారా తేవాలనుకుని ఎన్టీఆర్ కలలు కనగా... నేడు చంద్రబాబు నిజం చేయబోతుండటం ఆనందంగా ఉందన్నారు. 40 టీఎంసీలు ఈ ఏడాది తెచ్చుకోగలిగితే చంద్రబాబునాయుడు చరిత్రలో నిలిచిపోతారన్నారు. రాయలసీమ బిడ్డగా, ఈ గడ్డ రుణం తీర్చుకున్న నాయకుడిగా చరిత్రలో నిలుస్తారన్నారు జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్ మాట్లాడుతూ... హెచ్ఎన్ఎస్ఎస్ ద్వారా కృష్ణా జలాలు తేవడం ఆనందంగా ఉందన్నారు. ఈ పథకం ద్వారా 33 లక్షల మందికి తాగునీరు, 6 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. గత ఐదేళ్లు జగన్ హెచ్ఎన్ఎస్ఎస్‌కు తీరని అన్యాయం చేశారన్నారు. రాయలసీమ బిడ్డనని చెప్పుకుని, సీమకు తీరని ద్రోహం చేశారంటూ మండిపడ్డారు. సీఎం సంకల్పానికి ప్రకృతి సైతం సహకరిస్తోందన్నారు. శ్రీశైలం డ్యాం నిండుకుండలా ఉండటం, చంద్రబాబునాయుడు కాలువకు నీటిని విడుదల చేస్తుండటం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తలారి ఆదినారాయణ, నాయకుడు నారాయణస్వామి పాల్గొన్నారు.

డ్రిప్ పరికరాల మంజూరు వేగవంతం చేయాలి

ఏపీఎంఐపీ పీడీ రఘునాథ రెడ్డి



మాట్లాడుతున్న ఏపీఎంఐపీ పీడీ

అనంతపురం అర్బన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అర్హులైన రైతులకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి డ్రిప్, స్ప్రింక్లర్ల మంజూరును మరింత వేగవంతం చేయాలని ఏపీఎంఐపీ పీడీ రఘునాథ రెడ్డి ఆదేశించారు. ఏపీఎంఐపీ పీడీ కార్యాలయంలోని తన చాంబర్‌లో డ్రిప్ కంపెనీల డీసీఓలు, ఎంఐ ఇంజనీర్లతో ఆయన బుధవారం సమావేశమయ్యారు. గత ఆర్థిక సంవత్సరంలో పెండింగ్‌పడిన డ్రిప్ పరికరాల సరఫరా, తుది పరిశీలన ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రస్తుత ఏడాదికి జిల్లాకు 18వేల హెక్టార్లల్లో డ్రిప్, స్ప్రింకర్ల పరికరాల మంజూరు లక్ష్యాన్ని అధిగమించేలా ప్రణాళిక బద్ధంగా పనిచేయాలన్నారు. ఇప్పటిదాకా 1,900 హెక్టార్లకు పరికరాలు మంజూరు చేశారన్నారు. సకాలంలో పరికరాలు మంజూరు చేయడంతోపాటు సరఫరా అయ్యేలా చొరవ చూపాలని ఆదేశించారు.

చీనీ.. టన్ను రూ.15వేలు

అనంతపురంరూరల్, జూలై 16(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 15వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.3వేలు, సరాసరి ధర రూ.10వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 1227 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

గుత్తి మీదుగా ప్రత్యేక రైలు

గుంతకల్లు, జూలై 16(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ నియంత్రణకు సికింద్రాబాద్-తిరుపతి-సికింద్రాబాద్ (వయా గుత్తి) ప్రత్యేక వీక్లీ రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు బుధవారం ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాద్-తిరుపతి (నం. 07009) ప్రత్యేక వీక్లీ రైలు ఈనెల 31వ తేదీ నుంచి ఆగస్టు 28వ తేదీ వరకూ గురువారాల్లో సాయంత్రం 6.40 గంటలకు బయలుదేరి తిరుపతికి మరుసటి రోజు ఉదయం 7 గంటలకు చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు ఆగస్టు 1 నుంచి 29వ తేదీ వరకూ శుక్రవారాల్లో తిరుపతిలో సాయంత్రం 8.15 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం ఎనిమిదిన్నరకు సికింద్రాబాద్‌కు చేరుకుంటుందన్నారు. ఈ రైలు కాచిగూడ, ఉందానగర్, షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, వనపర్తి రోడ్, గద్వాల, కర్నూలు సిటీ, డోన్, గుత్తి, తాడిపత్రి, యర్రగుంట్ల, కడప, ఒంటిమిట్ట, రాజంపేట, రేణిగుంట స్టేషన్ల మీదుగా ప్రయాణిస్తుందన్నారు.

ఘనంగా కుళ్లాయిస్వామి జార్తాలు



అగ్నిగుండం వద్ద పూజలు చేస్తున్న దృశ్యం

నార్పల, జూలై16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రసిద్ధ గూగూడు కుళ్లాయిస్వామి పది రోజుల జార్తాలు కార్యక్రమాన్ని బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బ్రహ్మోత్సవాలు ముగిసిన పది రోజులకు అగ్ని గుండానికి గ్రామంలోని ముస్లింలు పూర్తి ఫాతేహాలు నిర్వహించారు. జార్తాలు సందర్భంగా గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ముస్లింలతో పాటు, గ్రామస్థులు పాల్గొన్నారు.

క్రికెట్ జట్టు ఎంపిక



ఎంపికైన జిల్లా అండర్-16 మల్టీ డే క్రికెట్ జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై16 (ఆంధ్రజ్యోతి): జిల్లా అండర్-16 మల్టీ డే బాలుర క్రికెట్ జట్టును బుధవారం ఎంపిక చేశారు. జట్టు వివరాలను స్థానిక అనంత క్రీడాగ్రామంలో జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి ప్రకటించారు. కెప్టెన్‌గా అనంతపురానికి చెందిన ఆర్ సాత్విక్ వ్యవహరించనున్నార. సంజయ్‌కుమార్ (నార్పల), కౌశిక్ (అనంతపురం), ఆశీష్ (అనంతపురం), తన్మయి కార్తీక్ రెడ్డి (అనంతపురం), జెయిద్ (హిందూపురం), అభినవ్ సాత్వికొరెడ్డి (అనంతపురం), ఆదినారాయణ రెడ్డి (ఆత్మకూరు), కుషాల్ సాయి (అనంతపురం), దేవాన్ష్ (అనంతపురం), కిరణ్‌కుమార్ (అనంతపురం), లిఖిత్ (అనంతపురం), సంతోష్ (కదిరి), అఖిల్‌కుమార్ (గొట్లూరు), నీహార్ (అనంతపురం), కార్తీక్ (అనంతపురం) జట్టులో చోటు సంపాదించారు. మహ్మద్ షోయబ్ కోచ్‌గా నియమితుడయ్యారు. ఎంపికైన జట్టు గురువారం నుంచి కడపలో నిర్వహించే ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సౌత్‌జోన్ అండర్-16 టోర్నీలో పాల్గొంటుందని భీమలింగారెడ్డి తెలిపారు.

ఆరేసిన ప్రమోద్

● నెల్లూరుపై అనంత గెలుపు ● కర్నూలు, కడప మ్యాచ్ డ్రా

మల్టీ డే క్రికెట్ టోర్నీ



రోహిత్‌రోషన్



కమ్మద్దీన్



ప్రమోద్

అనంతపురం క్లాక్‌టవర్, జూలై16 (ఆంధ్రజ్యోతి): ప్రమోద్ కుమార్ ఆరు వికెట్లతో చెలరేగడంతో మల్టీ డే క్రికెట్ పోటీల్లో నెల్లూరు జిల్లా జట్టుపై అనంత జట్టు విజయం సాధించింది. నాలుగో రౌండ్ మల్టీ డే క్రికెట్ పోటీలు బుధవారం మూడోరోజు స్థానిక అనంత క్రీడాగ్రామంలో ముగిశాయి. రాయలసీమ క్రికెట్ గ్రౌండ్‌లో నెల్లూరు, అనంతపురం జట్లు తలపడ్డాయి. మొదటి ఇన్నింగ్స్‌లో నెల్లూరు 69.1 ఓవర్లలో 237 పరుగులకు ఆలౌటైంది. అనంతపురం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 58 ఓవర్లలో 242 పరుగులకు ఆలౌటైంది. నెల్లూరు ఓవర్‌నైట్ స్కోరు 243/5తో మూడోరోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించింది. 319 పరుగులకు ఆలౌటైంది. అనంత బౌలర్ ప్రమోద్‌కుమార్ 6 వికెట్లతో చెలరేగాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో ఆతిథ్య జట్టు 44.5ఓవర్లలో 6వికెట్లు కోల్పోయి 315 పరుగులు సాధించింది. రోహిత్‌రోషన్ హాఫ్ సెంచరీ(46 బంతుల్లో 72)లో ఆకట్టుకున్నాడు. దీంతో అనంత జట్టు 4వికెట్ల తేడాతో విజయం సాధించింది.

కర్నూలు, కడప మ్యాచ్ డ్రా

మరో గ్రౌండ్‌లో కర్నూలు-కడప జట్లు తలపడ్డాయి. కర్నూలు మొదటి ఇన్నింగ్స్‌లో 59.4 ఓవర్లలో 210 పరుగులకు ఆలౌటైంది. మొదటి ఇన్నింగ్స్‌లో కడప 105 ఓవర్లలో 459 పరుగులకు ఆలౌటైంది. రెండో ఇన్నింగ్స్‌లో కర్నూలు 74.1 ఓవర్లలో 268 పరుగులకు 7వికెట్లు కోల్పోయింది. కర్నూలు బ్యాటర్ కమ్మద్దీన్ సెంచరీ (111)తో జట్టును ఆదుకున్నాడు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది.

ఫర్టిలైజర్స్ దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు



పెనుకొండలో ఫర్టిలైజర్ షాపులో తనిఖీ చేస్తున్న అధికారులు

కళ్యాణదుర్గం/పెనుకొండ రూరల్/రాయదుర్గం రూరల్/కణేకల్లు/బొమ్మనహాళ్, జూలై16(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని కళ్యాణదుర్గం, పెనుకొండ, రాయదుర్గం పట్టణాల్లోని ఫర్టిలైజర్స్ దుకాణాల్లో రాష్ట్రస్థాయి విజిలెన్స్ అధికారులు బుధవారం తనిఖీలు చేశారు. కళ్యాణదుర్గంలోని శ్రీహనుమాన్, మధు ఫర్టిలైజర్స్ దుకాణాల్లో అధికారులు సాలురెడ్డి, నరేంద్ర భూపతి, బాలానాయక్, జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ, ఏఓ శ్రావణ్ కుమార్ బృందంగా ఏర్పడి తనిఖీలు చేపట్టారు. రికార్డులకు, అక్కడున్న నిల్వలకు భారీ వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఆ రెండు దుకాణాల్లో నిల్వవున్న 12.570 మెట్రిక్ టన్నుల ఎరువుల అమ్మకాలు నిలిపేశారు. అధికారుల తనిఖీల సమాచారంతో పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను నిర్వాహకులు మూసేసి, వెళ్లిపోయారు. రాయదుర్గంలోని పలు దుకాణాల్లో తనిఖీలు చేసి, రూ.2.60 లక్షల విలువ గల అనుమతులు లేని ఎరువులను గుర్తించి, వాటి విక్రయాలను తాత్కాలికంగా నిలుపుదల చేశారు. కణేకల్లు, క్రాస్‌లోని దుకాణాల్లో తనిఖీలు చేశారు. బొమ్మనహాళ్, మండలం ఉద్దేహాళ్‌లోని శ్రీ శారదాదేవి సీడ్స్ దుకాణాన్ని తనిఖీ చేశారు. పెనుకొండలోని ఫర్టిలైజర్ షాపులను ఏడీఏ శివకుమార్, విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ శివన్న, ఏఓ ప్రసాద్, చందన తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేకపోవడంతో రూ.13.27 లక్షల విలువచేసే 46 క్వింటాళ్ల విత్తనాల అమ్మకాలను నిలిపేశారు.

రావమ్మా.. తుంగభద్రమ్మా..

నేడు హెచ్చెల్సీకి నీటి విడుదల

రాయదుర్గం, జూలై 16(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర ఎగువ కాలువ(హెచ్చెల్సీ)కి గురువారం నీరు విడుదల చేయనున్నట్లు బోర్డు ఎస్ఈ నారాయణనాయక్ ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే కర్ణాటకకు సంబంధించిన వాటా నీటిని విడుదల చేసిన విషయం తెలిసిందే. వారం క్రితం నీరు విడుదల చేయడంతో ఆంధ్ర సరిహద్దులోని 105 కి.మీ. వద్ద జలాలు వచ్చి నిలువ ఉన్నాయి. కర్ణాటక వాటా కింద రోజుకు 700 క్యూసెక్కుల నీరు వదులుతున్నారు. ఈ నేపథ్యంలో ఆంధ్ర వాటా కింద రోజుకు 500 క్యూసెక్కుల నీరు వదలాలని హెచ్చెల్సీ ఎస్ఈ విశ్వనాథ్‌రెడ్డి బుధవారం సాయంత్రం బోర్డుకు ఇండెంట్ సమర్పించారు. దీంతో గురువారం ఉదయం ముహూర్తం చూసుకుని సరిహద్దులో నిల్వ ఉన్న జలాలను దించిన రెగ్యులేటర్‌ను ఎత్తి, ఆంధ్ర జలాలను విడుదల చేసేలా బోర్డు సరిహద్దు డీఈకి ఆదేశించారు. కాలువ మరమ్మతులు, అడ్డుగా ఉన్న మట్టి, రాళ్ల తొలగింపు పూర్తవడంతో నీరు విడుదల చేయనున్నారు. నీటి ప్రవాహానికి ఇబ్బంది లేదని క్షేత్రస్థాయి అధికారులు కాలువపై గస్తీ నిర్వహించి, గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేశారు. దీంతో గురువారం నుంచి హెచ్చెల్సీ జలాలు ఆంధ్రలో ప్రవహించనున్నాయి.

26 మందిపై ఎస్సీ, ఎస్టీ కేసు

శెట్టూరు, జూలై16(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాకొడికి గ్రామానికి చెందిన 26 మందిపై పోలీసులు బుధవారం ఎస్సీ, ఎస్టీ వేధింపుల చట్టం కింద కేసు నమోదు చేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన పీర్ల చావిడిలోకి ఎస్సీలు రాకూడదని బీసీ వర్గానికి చెందిన వారు శనివారం వాదనకు దిగారు. దళిత వర్గానికి చెందిన గంగాధర్ చావిడిలోకి వెళ్లేందుకు యత్నించగా.. బీసీ వర్గానికి చెందిన 26 మంది.. అతడిపై దాడి చేసి, గాయపరిచారు. దీనిపై బాధితుడు అదేరోజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయినా పోలీసులు.. దాడిచేసిన వారిపై కేసు నమోదు చేయకపోవడంతో ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి బాధితులు సోమవారం స్థానిక పోలీసు స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ నేపథ్యంలో దాడి చేసిన 26 మందిపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్ రాంభూపాల్ తెలిపారు.

జర్నలిస్టు హెల్త్ స్కీమ్ పొడిగింపు

అనంతపురం కలెక్టరేట్ జూలై 16(ఆంధ్రజ్యోతి): వర్కింగ్ జర్నలిస్టుల హెల్త్ స్కీమ్ 2025-26 ఆర్థిక సంవత్సరానికి పొడిగిస్తూ వైద్య ఆరోగ్య, కుటుంబసంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీ చేసినట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ బుధవారం ప్రకటనలో తెలిపారు. జర్నలిస్టులందరూ ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

ఆడం స్మిత్ (వర్ధంతి)



తత్వవేత్త, ఆర్థికవేత్తగా రాణించిన స్కాట్లాండ్ దేశానికి చెందిన ఆడం స్మిత్ 1723 జూన్ 5న జన్మించారు. 'ది ఫాదర్ ఆఫ్ ఎకనామిక్స్' లేదా 'ది ఫాదర్ ఆఫ్ కేపిటలిజం'గా పేరొందారు. రాజకీయ, ఆర్థిక విధానాలకు చక్కటి బాటలు వేశారు. స్కాట్లాండ్ దేశ పురోగతిలో కీలకంగా వ్యవహరించారు. సామాజిక విలువ, ఆర్థిక అంశాలపై పలు రచనలు చేశారు. 'వెల్త్ ఆఫ్ నేషన్స్' పుస్తకం ఎంతో పేరొందింది. 1790 జూలై 17న కన్నుమూశారు.

నికోలస్-2 (వర్ధంతి)



రష్యా సామ్రాజ్య చివరి చక్రవర్తి సీజర్ నికోలస్-2 1868 మే 18న జన్మించారు. అసలు పేరు నికొలై అలెగ్జాండ్రోవిచ్ రోమనోవ్. 1894 నుంచి తుదిశ్వాస వరకు పాలనలో ఎన్నో సంస్కరణలు తెచ్చారు. ప్రత్యేకించి హక్కులు, విద్యా విధానాలు, పరిపాలన విధానాలకు బాటలు వేశారు. దేశం ఆర్థికంగా, రాజకీయంగా బలోపేతం కావడానికి ఎంతో కృషి చేశారు. రష్యన్ ఆర్థడాక్స్ చర్చ్‌కు సెయింట్ నికోలస్‌గా వ్యవహరించారు. 1918 జూలై 17న హత్యకు గురయ్యారు.

నియామకం

గోరంట్ల(ఆంధ్రజ్యోతి): బూదిలి, వానవోలు, గోరంట్ల సహకార సంఘాలకు నూతన కమిటీలను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు చేసింది. గోరంట్ల సింగిల్‌విండో అధ్యక్షుడిగా మాజీ జడ్పీటీసీ గోపాల్‌రెడ్డి, సభ్యులుగా నబీరసూల్, పూలగంగాధర్, వానవోలు సింగల్‌విండో అధ్యక్షుడిగా బాసన్నపల్లి వెంకటరమణ, సభ్యులుగా శ్రీనివాసులు, నగేష్, బూదిలి సింగల్‌విండో అధ్యక్షులడిగా రామన్నపల్లి శివశంకర్‌రెడ్డి, సభ్యులుగా కుళ్లాయప్ప, నవీన్‌కుమార్ నియమితులయ్యారు.

పెనుకొండ(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇస్లాపురం సింగిల్‌విండో అధ్యక్షుడిగా చంద్రగిరికి చెందిన టీడీపీ నాయకుడు కొత్తరెడ్డి పోతిరెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. డైరెక్టర్‌గా గుట్టూరుకు చెందిన ఆదిశేషు, నాగలూరుకు చెందిన గోపాల్‌తో సీఈఓ హరిక్రిష్ణ ప్రమాణస్వీకారం చేయించారు. నూతన కార్యవర్గానికి టీడీపీ నాయకులు నాగలూరు నారాయణస్వామి, మునిమడుగు వెంకటరాముడు, త్రివేంద్రనాయుడు, గుట్టూరు నాగరాజు, కన్వీనర్ ఈశ్వర్‌ప్రసాద్, మావటూరు గోపాల్ తదితరులు అభినందనలు తెలిపారు.

మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారం

అదనపు జిల్లా న్యాయాధికారి కంపల్లె శైలజ

హిందూపురం, జూలై 16(ఆంధ్రజ్యోతి): కోర్టుల్లో దీర్ఘకాలికంగా ఉన్న కేసుల పరిష్కారానికి మధ్యవర్తిత్వం ఎంతో దోహదపడుతుందని అదనపు జిల్లా న్యాయాధికారి కంపల్లె శైలజ అన్నారు. బుధవారం న్యాయవాదులు మధ్యవర్తిత్వంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పాల్గొన్న అదనపు జిల్లా న్యాయమూర్తి కంపల్లె శైలజ మాట్లాడుతూ కేసులు పరిష్కరించడంలో మధ్యవర్తిత్వం కీలకపాత్ర పోషిస్తుందన్నారు. ముఖ్యంగా చెక్‌బౌన్స్, భరణం కేసుల్లో మధ్యవర్తుల ద్వారా పరిష్కారం త్వరగా అవుతుందన్నారు. ఆ దిశగా న్యాయవాదులు చొరవ చూపాలన్నారు. దీనివల్ల కక్షిదారులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీనియర్‌సివిల్‌న్యాయాధికారి వెంకటేశ్వర్లునాయక్, ప్రత్యేక న్యాయమూర్తి రమణయ్య, న్యాయవాదులు రాజశేఖర్, సిద్దు, సంతోష్‌కుమారి, శ్రీనివాసరెడ్డి, రవికుమార్ పాల్గొన్నారు.

పెనుకొండ రూరల్(ఆంధ్రజ్యోతి): కోర్టులో కేసులు ఉన్నవారికి మధ్యవర్తిత్వంపై అవగాహన నిర్వహించారు. బుధవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, న్యాయమూర్తి వాసుదేవన్, బొజ్జప్ప, రాకేష్ పాల్గొని అవగాహన కల్పించారు. ర్యాలీ నిర్వహించారు.

చట్టాలపై మహిళలకు అవగాహన

సోమందేపల్లి, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రహ్మసముద్రం గ్రామంలో టింబక్టివ్ కలెక్టివ్ ఆధ్వర్యంలో ఉచిత న్యాయసేవాసదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గాశక్తి సొసైటీ అధ్యక్షులు ముంతాజ్ మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కవిత, మహిళాశక్తి సీఈఓ రమీజ, లక్ష్మీదేవి, లక్ష్మమ్మ, నాగమ్మ పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, జూలై16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండిరెడ్డిపల్లికి చెందిన వివాహిత నాగమ్మ బుధవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. తరచూ తలనొప్పి తీవ్రంగా వస్తుండడంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. డాక్టర్ వినోద్‌కుమార్ చికిత్సలు చేసి, మెరుగైన వైద్యంకోసం 108లో హిందూపురం తరలించారు.

యువకుడి ఆత్మహత్య

గుడిబండ, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలేపల్లి గ్రామానికి చెందిన మంజునాథ్(30) ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ రాజకుల్లాయప్ప, ఏఎస్ఐ రమణ తెలిపారు. మంజునాథ్‌కు తరచూ కడుపునొప్పి వస్తుండటంతో జీవితంపై విరక్తిచెంది మంగళవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పెనుకొండలో మోస్తరు వర్షం

పెనుకొండ, జూలై 16(ఆంధ్రజ్యోతి): ప్రతిరోజూ ఆకాశం మేఘావృతమై వర్షం కురవకపోవడంతో వేడిమిని తట్టుకోలేక తల్లడిల్లుతున్న ప్రజలకు బుధవారం సాయంత్రం భారీ వర్షం కురవడంతో ఉపశమనం పొందారు. వర్షం కోసం ఎదురుచూస్తున్న రైతులు ఖరీఫ్‌లో వేరుశనగ సాగుచేయడానికి ఈ వర్షం కొంతమేర అనుకూలంగా ఉంటుందని భావిస్తున్నారు.

విజయవంతం చేయండి: సీపీఎం

చిలమత్తూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): కదిరిలో ఈనెల 27, 28 తేదీల్లో నిర్వహించనున్న సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని నాయకులు ప్రవీణ్, సిద్దారెడ్డి, వెంకటేశులు, రామచంద్ర, సుధాకర్, నాగరాజు పిలుపునిచ్చారు. రెండు రోజులపాటు నిర్వహిస్తున్న మహాసభల్లో ప్రజా సమస్యలపై చర్చ జరిపి భవిష్యత్ కార్యాచరణను రూపొందించడం జరుగుతుందన్నారు. అనంతరం మహాసభలకు సంబంధించి కరపత్రాలను విడుదల చేశారు.

గార్డెన్ సిటీకి పూర్వ వైభవం తెద్దాం

» మంత్రి ఈశ్వర్ ఖండ్రె

బొమ్మనహళ్లి జూలై 16(ఆంధ్రజ్యోతి): గార్డెన్ సిటీ బెంగళూరు మహానగరానికి పూర్వవైభవం తెద్దామని అటవీశాఖ మంత్రి ఈశ్వర్‌ఖండ్రె తెలిపారు. హెచ్ఎస్ఆర్ లే అవుట్‌లోని వాజ్‌పేయ్ క్రీడా మైదానంలో బుధవారం 10వేల మొక్కల నాటే కార్యక్రమానికి మంత్రి ముఖ్యులుగా పాల్గొని మాట్లాడారు. పచ్చదనానికి మారుపేరుగా బెంగళూరుగా ఉండేదని, రానురాను విస్తరించడం, రోడ్లు, ఇతర అభివృద్ధి పనులతో చెట్లు తొలగించడం, మరికొన్ని పాతబడిన చెట్లు కూలిపోయాయన్నారు. తగ్గిన పచ్చదనాన్ని పెంచేలా ప్రతిచోటా మొక్కలు పెంచదలిచామన్నారు. మాజీ ఎంపీ ఉగ్రప్ప నేతృత్వంలో భారీస్థాయిలో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చేపట్టడం అభినందనీయమన్నారు. గతంలో కూడా ఉగ్రప్ప ఇలా మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహించి ప్రోత్సహించారని గుర్తు చేశారు. ఇటీవల కాలుష్యం అధికమై అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. చక్కటి ఆరోగ్యానికి, పచ్చదనం పెంచడానికి మొక్కల పెంపకం ఒక్కటే మార్గమన్నారు. మొక్కలు నాటడమే కాక వాటి పరిరక్షణ ముఖ్యమన్నారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. మాజీ ఎంపీ ఉగ్రప్ప మాట్లాడుతూ మారిన కలుషిత వాతావరణంతో పలు అనారోగ్య సమస్యలు తలెత్తాయని, వీటికి అడ్డుకట్ట వేసేందుకు ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ఇందుకు కార్యకర్తలు, నాయకులు ఎంతో మంది సహకారం అందిస్తున్నా రన్నారు. స్వాభిమాన పార్కు, తదితర ప్రాంతా లలో మొక్కలు నాటామని గుర్తు చేశారు. కార్యక్రమంలో హోం మంత్రి పరమేశ్వర్, మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర మహిళాకాంగ్రెస్ అధ్యక్షురాలు సౌమ్యరెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ ఆర్‌కే రమేశ్, బెంగళూరు దక్షిణ నియోజకవర్గ కాంగ్రెస్ అధ్యక్షుడు మంజునాథ్, బొమ్మనహళ్లి బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు మధు, హెచ్ఎస్ఆర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాఘవేంద్ర, బిలేకహళ్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ధనంజయ, కాంగ్రెస్ నాయకులు లోకేశ్‌రెడ్డి, ఉమా, అభిషేక్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.



మొక్కకు నీరు పోస్తున్న మంత్రి ఈశ్వర్ ఖండ్రె

అధ్యాపకులు.. సమాజ మార్గదర్శకులు..



పుస్తకావిష్కరణలో ఎంకే శ్రీధర్ తదితరులు

» చాణక్య యూనివర్సిటీ వ్యవస్థాపక చాన్స్‌లర్ ఎంకే శ్రీధర్

బెంగళూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు, అధ్యాపకులలో ఎంతోమంది విద్యార్థుల అభ్యున్నతి కోసమే పాటుపడతారని అటువంటి సాధకులు సమాజానికి ఆదర్శమని చాణక్య యూనివర్సిటీ వ్యవస్థాపక చాన్స్‌లర్ ఎంకే శ్రీధర్ అభిప్రాయపడ్డారు. అజీ ప్రేమ్‌జీ యూనివర్సిటీ ద్వారా జాగృత శిక్షకర అంతరంగ, అదమ్య శిక్షకర గెలివిన హాది పేరిట అధ్యాపకుల సాధనలకు సంబంధించి రచించిన పుస్తకాలను లాంఛనంగా విడుదల చేశారు. అజీం ప్రేమ్‌జీ యూనివర్సిటీ ప్రతినిధి రుద్రేశ్‌తోపాటు అనువాదకులు ప్రొఫెసర్ జేఎస్ సదానంద పాల్గొన్నారు. విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రష్మి మహేశ్ భాగస్వాములయ్యారు.

శక్తి పథకం విజయోత్సవం

శిడ్లఘట్ట, జూలై 16(ఆంధ్రజ్యోతి): శక్తి పథకం విజయవంతం కావడంపై పట్టణంలోని కేఎస్ఆర్టీసీ డిపోలో బుధవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. మహిళలకు పసుపు కుంకుమ, మిఠాయిలు పంపిణీ చేశారు. డిపో మేనేజర్ టీవీ నాగేశ్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు శక్తి పథకం 500 కోట్ల మంది ప్రయాణీకుల ఉచిత ప్రయాణం సందర్భంగా కార్యక్రమం నిర్వహి స్తున్నట్టు తెలిపారు. శక్తి పథకం ప్రారంభమైనప్పటి నుంచి ఇంతవరకు తాలూకాలో సుమారు 85,90,102 మంది ప్రయాణీకులు చేశారని వివరించారు. ఇందుకు సుమారు రూ.30.71కోట్లు ఖర్చు అయ్యిందన్నారు. ఈ సందర్భంగా డిపో ఇన్‌చార్జ్ అధికారి జేవీ శ్రీధర్, బస్టాండ్ ఆఫీసర్ బీవీ చలపతి, ట్రాఫిక్ ఆఫీసర్ పరమేశ్వర్ సింఘి, కంప్యూటర్ ఆఫీసర్ నారాయణస్వామి సిబ్బంది పాల్గొన్నారు.



కేఎస్ఆర్టీసీ డిపోలో సంబరాలు

పేకాట అడ్డాపై దాడి.. నగదు, ద్విచక్రవాహనాల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ఫోన్లు, నగదు



ద్విచక్రవాహనాలు

చింతామణి, జూలై 16(ఆంధ్రజ్యోతి): పట్టణానికి అనుబంధంగా ఉన్న కావలుగానహళ్లి గ్రామంలోని ఒక ఇంట్లో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో పోలీసులు మంగళవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. చింతామణి ఉప విభాగం డీఎస్పీ మురళీధర్ నేతృత్వంలో కార్యాచరణ నిర్వహించారు. 4 మొబైల్ ఫోన్లు, 9 ద్విచక్రవాహనాలు, రూ.3400 నగదు స్వాధీనం చేసుకున్నారు. కన్నంపల్లికి చెందిన విజికుమార్ (49), సోలదేవనహళ్ళికి చెందిన అంబరీశ్ (28), వడ్డహళ్ళికి చెందిన నవీన్ (40)లు పట్టుబడినవారిగా గుర్తించారు. చింతామణి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రశంసించారు. నేరాల నియంత్రణకు ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు.

ఆర్‌డీపీఆర్ సంఘానికి నూతన పదాధికారులు



సామర్థ్యసౌధ వద్ద సంఘం పదాధికారులు

ముళబాగిలు, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఆర్‌డీపీఆర్ ఎస్సీ ఎస్టీ అధికారులు, ఉద్యోగుల సంక్షేమ సంఘం కోలారు జిల్లా ముళబాగిలు తాలూకా శాఖకు నూతన పదాధికారులు ఎంపికయ్యారు. సంఘం గౌరవాధ్యక్షుడు గంగప్ప, అధ్యక్షుడు వెంకటరమణ, ఉపాధ్యక్షుడు నారాయణస్వామి, కోశాధికారి గురుప్రసాద్, ప్రధాన కార్యదర్శి అంబరీశ్, కార్యదర్శి కేఎన్ మంజునాథ్, సాంస్కృతిక క్రీడా కార్యదర్శి ఎంవీ శారదమ్మ ఎంపికయ్యారు. పట్టణంలోని సామర్థ్యసౌధలో ఏర్పాటైన సమావేశంలో పదాధికారులను ఎంపిక చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటా చలపతి, గౌరవాధ్యక్షుడు సొన్నవాడి పీడీఓ సీపీ అశ్వథ్ నారాయణ, రాష్ట్రసంఘం ప్రముఖులు దేవరాయసముద్ర పీడీఓ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేత్ర పరీక్షా శిబిరం

శిడ్లఘట్ట, జూలై 16(ఆంధ్రజ్యోతి): ధర్మస్థళ గ్రామాభివృద్ధి సంస్థ బీసీ ట్రస్టు ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని శంకరమఠం సభాంగణంలో ఉచిత నేత్ర పరీక్షా శిబిరం నిర్వహించారు. జిల్లా జనజాగృతి సభ్యుడు హిత్తలహళ్ళి సురేశ్ మాట్లాడుతూ వీరేంద్రహెగ్డే ఆశయం మేరకు గ్రామీణ ప్రాంత పేదల అనుకూలం కోసం సమాజసేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిబిరంలో మహిళలకు బీపీ, షుగర్, ఈసీజీ, పాదాల పరీక్షలతోపాటు కంటి పరీక్షల అనంతరం అవసరమైనరికి కళ్లద్దాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో శంకరమఠం కమిటీ అధ్యక్షుడు కృష్ణమూర్తి, సమాఖ్యకు చెందిన లక్ష్మమ్మ, మహావీర్ జైన్ ఆసుపత్రికి చెందిన సంజయ్, దృష్టి హాస్పిటల్‌కు చెందిన మధు కుమార్, జ్ఞాన వికాస సంఘానికి చెందిన అరుణ, సేవా ప్రతినిధులు భాగ్యమ్మ, వీణా తదితరులు పాల్గొన్నారు.



శిబిరంలో కళ్లద్దాల పంపిణీ

సూర్యఘర్‌లో మహిళలే కీలకం

మోడల్ గ్రామానికి రూ.కోటి ప్రోత్సాహం

కాలుష్యరహిత మోడల్ గ్రామాలకు అడుగులు

అవగాహన సదస్సులో జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని

హిందూపురం, జూలై 16(ఆంధ్రజ్యోతి): సౌరశక్తిలో మహిళలు కీలకపాత్ర పోషించాలని రాష్ట్ర రెవెన్యూ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. బుధవారం లేపాక్షి రోడ్డులోని జేవీఎస్ ప్యాలెస్‌లో ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలి యోజన సబ్సిడీ పథకంపై అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి అనగాని సత్యప్రసాద్‌తోపాటు కలెక్టర్ టీఎస్ చేతన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పీఎం సూర్యఘర్ పథకంలో మహిళల భాగస్వామ్యం ఎంతో కీలకమన్నారు. కోటి ఇళ్లమీద రూఫ్‌టాప్ ఏర్పాటుచేసుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఏ గ్రామంలో అయితే వేగంగా అన్ని ఇళ్లమీద రూఫ్‌టాప్ సోలార్ సిస్టం ఏర్పాటు చేసుకుంటే ఆ గ్రామానికి రూ.కోటి ప్రోత్సాహం కింద అందజేస్తామన్నారు. ఆ నిధులతో ఆ గ్రామం మోడల్ విలేజ్‌గా మారుతుందని వివరించారు. మహిళల్లో ఆర్థిక స్వావలంబన పెంపొందించడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషిచేస్తుందన్నారు. సోలార్ ఏర్పాటువల్ల విద్యుత్ బిల్లు తగ్గుతుందన్నారు. 3కేవీ సోలార్ ఏర్పాటుచేసుకుంటే రూ.2.10లక్షలు ఖర్చవుతుందన్నారు. ఇందులో పొదుపుసంఘాల నుంచి రూ.1.12లక్షలు బ్యాంక్ రుణాన్ని అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఆనంద్‌కుమార్, ఎమ్మెల్యే పీఏలు సురేంద్ర, వీరయ్య, టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్మన్ రమేష్, కమిషనర్ మల్లికార్జున, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, ట్రాన్స్‌కో ఎస్ఈ సంపత్‌కుమార్, టీడీపీ జిల్లా అధ్యక్షులు కొల్లకుంట అంజినప్ప పాల్గొన్నారు.



బ్రోచర్ విడుదల చేస్తున్న మంత్రి అనగాని

రోడ్డెక్కిన గేదెలు

● చంద్రా లే అవుట్‌లో నిత్యం సమస్య



రోడ్డుపై గేదెల సంచారం

బెంగళూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఐటీ బీటీ నగరిగా పేరొంది దేశంలోనే అత్యధిక వాహనాలు కల్గిన బెంగళూరులో రోడ్డు ప్రయాణం అంటే ట్రాఫిక్‌తో ఇబ్బంది అనేది తెలిసిందే. అటువంటి రద్దీగా ఉండే రోడ్లపైనే గేది లను వదులుతారు. చంద్రా లే అవుట్‌లో నిత్యం గేదెలు రోడ్డెక్కుతాయి. ఉద యం, సాయంత్రం ఆ మార్గంలో వెళ్లాలంటే ఇబ్బంది పడే పరిస్థితి ఉంటుం ది. ఇలా నగరంలో పలుచోట్ల పాడి పశువులను రోడ్డుపైకి వదులుతున్నారు.

విత్తన పంపిణీ అక్రమాలపై దర్యాప్తునకు డిమాండ్

బాగేపల్లి, జూలై 16(ఆంధ్రజ్యోతి): తాలూకాలో ఖరీఫ్ నేపథ్యంలో విత్తన పనులు సాగుతున్నాయని, సబ్సిడీ విత్తనాల పంపిణీలో జరిగిన అక్రమాలపై దర్యాప్తు చేయాలని కర్ణాటక ప్రాంత రైతుసంఘం (కేపీఆర్ఎస్) తాలూకా విభాగం డిమాండ్ చేసింది. సంఘం తాలూకా సంచాలకులు డీటీ మునిస్వామి, జిల్లా సంచాలకులు చన్నరాయప్ప బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వ్యవసాయశాఖ ద్వారా వేరుశనగ, మొక్కజొన్న, రాగి, కంది విత్తనాలను రైతులకు సబ్సిడీ రూపంలో ఇస్తున్నారని, అయితే కొంతమంది రాజకీయ నేతల ఒత్తిడికి తలొగ్గి కొంతమంది అధికారులు అక్రమాలకు పాల్పడ్డారన్నారు. సన్నకారు రైతులకు సైతం ఇచ్చే సబ్సిడీలలోనూ అక్రమాలకు పాల్పడ్డంపై విచారం వ్యక్తం చేశారు. నూనెగింజల సాగును ప్రోత్సహించేలా పైలట్ ప్రాజెక్టుగా రాష్ట్రప్రభుత్వం వేరుశనగ గింజలను సబ్సిడీగా ఇస్తున్నారన్నారు. వీటిలో కూడా అక్రమాలకు పాల్పడుతున్నాని ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

యక్షగాన బృందానికి బహుమతి



యక్షగాన బృందం

విజయపుర, జూలై 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నగర్త మహిళా సంఘం సభ్యులు ఆనేకల్ సమీపంలోని హారగద్దెలో నిర్వహించిన నగర్త మహిళా సంఘం ప్రారంభోత్సవం సందర్భంగా మహిళా సాంస్కృతిక మేళాలో విజయపుర సంఘం యక్షగాన నృత్యం ఆకర్షణగా నిలిచి బహుమతి సాధించింది. యక్షగాన నృత్యంలో పట్టణానికి చెందిన అక్షతా, నమితా, పూజా, రూపిణి, అశ్విని, మానస పాల్గొన్నారు.

కర్ణాటక సీఎం సభకు ఆహ్వానం

పావగడ, జూలై 16(ఆంధ్రజ్యోతి): కర్ణాటక సీఎం సిద్దరామయ్య ఈనెల 21న పావగడకు వస్తున్న సందర్భంగా ఎమ్మెల్యే వెంకటేశ్, మాజీ మంత్రి వెంకటరమణప్పను తమకూరు జిల్లా కలెక్టర్ శుభకల్యాణి ఆహ్వానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, హోంమంత్రి పరమేశ్వర్, సహకార మంత్రి కెఎన్ రాజన్న తదితరులు సోమవారం పట్టణంలోని మహాత్మగాంధీ స్టేడియంలో నిర్వహించే భారీ బహిరంగ సభకు వస్తున్నారన్నారు. ఈ సందర్భంగా అభివృద్ధి పథకాలకు ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

బాధ్యతల స్వీకరణ

గోరంట్ల, జూలై16 (ఆంధ్రజ్యోతి): పాలసముద్రం సింగిల్ విండో అధ్యక్షుడిగా బెల్లాచెరువు జయచంద్ర బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనతోపాటు కమిటీ సభ్యులుగా వడిగేపల్లి సాలెప్ప, మల్లాపల్లి సరస్వతి బాధ్యతలు తీసుకున్నారు. సహకార సంఘం అభివృద్ధి, రైతు సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తామని జయచంద్ర ఈ సందర్భంగా అన్నారు. అనంతరం టీడీపీ కార్యాలయంలో జయచంద్రాను నాయకులు, కార్యకర్తలు సన్మానించారు. కార్యక్రమంలో కన్వీనర్ బాలకృష్ణ, జిల్లా కార్యదర్శి నరసింహులు, మండల ప్రధాన కార్యదర్శి అశ్వర్థరెడ్డి, మాజీ ఎంపీపీ నిమ్మల విద్యాధరణీ, మనోహర్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలను శుభ్రంగా ఉంచండి: డీఎల్‌పీఓ

పరిగి, జూలై 16(ఆంధ్రజ్యోతి): పారిశుధ్యంపై పంచాయతీ కార్యదర్శులు వెంటనే చర్యలు తీసుకోవాలని డీఎల్‌పీఓ సమత సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీఓ మాట్లాడుతూ గ్రామాల్లో చెత్తాచెదారం లేకుండా, మురుగు కాలువలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకూడదన్నారు. మసీదు పక్కన కొన్ని నెలలుగా చెత్తను తీయలేదని స్థానికులు డీఎల్‌పీఓకు ఫిర్యాదు చేశారు. పంచాయతీ కార్యదర్శి సంజప్పను పిలిచి వెంటనే శుభ్రం చేయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రెడ్డప్ప, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1626.06	1608.91
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	40,117	25,349
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	29,607	211
నీటి నిల్వ (టీఎంసీలు)	80.00	35.47



జలపాతం కింద పర్యాటకుడి జలకాలాట

ఆకట్టుకుంటున్న జలపాతాలు

కంప్లి, జూలై 16(ఆంధ్రజ్యోతి): కొప్పళ జిల్లా కుష్టిగి తాలుకా హనుమసాగర్ వద్దనున్న జలపాతాలు పర్యాటకులకు ఆకట్టుకుంటున్నాయి. హంపి పుణ్యక్షేత్రం వచ్చిన పర్యాటకులు హనుమసాగర్ జలపాతాలను తిలకించుకుని ఆనందం వ్యక్త పరుస్తున్నారు. ఆలయాలు, మండపాలు పచ్చదనం తుంగభద్ర నది పరవళ్లు, కిష్కింధలోని దుర్గమ్మదేవస్థానం, ఆంజనేయ జన్మస్థలం, ఉలిగమ్మదేవి, తుంగభద్ర జలాశయం హంపిలోని ప్రదేశాలను వీక్షిస్తున్నారు. రాష్ట్రంతో పాటు పొరుగు రాష్ట్రం నుంచి కూడా పర్యాటకులు భారీ ఎత్తున తరలి వస్తున్నారు.

దరోజీ రైల్వే స్టేషన్‌లో నీటి ఎద్దడి



నీరు లేక.. వృథాగా ఉన్న కొళాయిలు

కంప్లి, జూలై 16(ఆంధ్రజ్యోతి): తాలుకా పరిధిలో దరోజీ రైల్వే స్టేషన్‌లో నీటి సమస్యతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతి నిత్యం ఎంతో మంది గంగావతి, కంప్లి చుట్టుపక్కల గ్రామాల క్యాంపు వాసులు రైల్వే స్టేషన్ నుంచి ప్రయాణం సాగిస్తున్నారు. కానీ ఇక్కడ మాత్రం తాగేందుకు గుక్కెడు నీరు లభించడం లేదు. రైలులో ప్రయాణించేవారు రైల్వే స్టేషన్లో రైలు నిలబడిన సమయంలో బాటిళ్లతో నీటికోసం కొళాయిలు వద్దకు వెళ్లి నీరు రాకపోయే సరికి నిరాశతో వెనుతిరుగుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రయాణికులను దృష్టిలో ఉంచుకుని నీటి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు లోకాయుక్త అధికారుల పర్యటన



మాట్లాడుతున్న తహసీల్దార్ గౌసియాబేగం

సిరుగుప్ప, జూలై 16 (ఆంధ్రజ్యోతి): తాలూకాలో లోకాయుక్త అధికారులు గురువారం పర్యటించనున్నట్లు తహసీల్దార్ గౌసియా బేగం తెలిపారు. పట్టణంలో శిశు అభివృద్ధి యోజన కార్యాలయ భవనంలో అధికారులు తాలుకా ప్రజల నుంచి సమస్యలపై ఫిర్యాదులు, దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు సమావేశంలో పాల్గొనాలని ఆమె కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

హోస్పేట, జూలై 16(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఈ రంగంలో సేవలందించిన వ్యక్తులు, సంస్థలకు అవార్డుల ప్రదానోత్సవానికి 2025-జాతీయ దివ్యాంగుల అవార్డు కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వికలాంగుల సంక్షేమ అధికారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సంవత్సరం డిసెంబరు 3న న్యూఢిల్లీలోని సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ వికలాంగుల దినోత్సవం నిర్వహిస్తోంది. ఆసక్తిగల అభ్యర్థులు వెబ్‌సైట్ ద్వారా జాతీయ అవార్డుల పోర్టల్‌లో జూలై 31లోపు సమర్పించాలన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా వికలాంగుల సంక్షేమ అధికారి ఆగాపే ప్రార్థనా మందిరం ఎదురుగా, డీసీ రవి సివిల్ ఇంజనీర్ భవనం అమరావతి హోస్పేట చిరునామాలలో సంప్రదించాలన్నారు.

ఏ తల్లి కన్న బిడ్డో..?

రోడ్డు పక్కన దొరికి.. ఆస్పత్రిలో మృతి



చిన్నారి మృతదేహం

బళ్లారి రూరల్, జూలై 16(ఆంధ్రజ్యోతి): నగరంలోని హోస్పేట రోడ్డు బెంగళూరు బైపాస్ పక్కన నవజాత ఆడ శిశువును 12వ తేదీన గుర్తు తెలియని వ్యక్తులు వదిలేసి వెళ్లారు. తోరణగల్లుకు చెందిన లక్ష్మీ యశోద కూరగాయలు అమ్ముకొని జీవనం సాగిస్తున్న ఆమెకు చిన్నపిల్ల ఏడుపు వినిపించడంతో ఆ పాపను తీసుకుని మోదీ డిగ్రీ కళాశాల సమీపంలో ఉన్న బీఎంపీఅండ్‌ఆర్‌సీ ఆస్పత్రిలో చేర్పించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం చిన్నారి మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. దీనిపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఉన్నత చదువులపై అవగాహన

పెనుకొండ, జూలై 16(ఆంధ్రజ్యోతి): 10వ తరగతి తరువాత విద్యార్థులు ఉన్నత చదువులకు సంబంధించి ఏవిధంగా ప్లాన్ చేసుకోవాలన్న అంశంపై బుధవారం లైఫ్ అట్ ఏపీఎస్ 21 సెంచరీ కాలేజ్, శంషాబాద్ ప్రతినిధులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. బుధవారం స్థానిక ప్రగతి గ్లోబుల్‌జెన్ సీబీఎస్‌ఈ పాఠశాలలో కళాశాల ప్రతినిధులు భవానీశంకర్, విశ్వనాథ్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపీసీ, బీపైసీ ద్వారా కేవలం ఇంజనీరింగ్‌మెడికల్ కోర్సులేకాకుండా చాలా కాంపిటేటివ్ పరీక్షలు ఉన్నాయన్నారు. విద్యార్థులు ఏ కోర్సులు చేయాలనే అంశంపై వివరించారు. పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పోలీసు క్వార్టర్లకు వీడిన గ్రహణం

● 9 నెలల తరువాత రెండోసారి భూమిపూజ

బళ్లారి గాంధీనగర్, జూలై 16(ఆంధ్రజ్యోతి): నగరంలో పోలీసు క్వార్టర్స్ నిర్మాణాలకు పట్టిన గ్రహణం వీడింది. బుధవారం ఉదయం ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. గత ఏడాది నవంబరు 6న అప్పటి ఐజీపీ లోకేష్, ఎస్పీ శోభారాణి పోలీసు క్వార్టర్స్ నిర్మాణాలకు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. పట్టుమని వారం రోజులు కాకమునుపే స్థానిక నేతల మౌఖిక ఆదేశాలతో పనులు నిలిచిపోయాయి. క్వార్టర్స్ పనులు ప్రారంభానికి సంబంధించిన భూమి పూజకు ప్రొటోకాల్ పాటించలేదన్న ఒకే ఒక్క కారణంతో పనులు ఆపేసినట్లు పోలీసు వర్గాల్లో చర్చ జరిగింది. ఇదే విషయంపై జూన్ 16వ తేదీన 'నిర్మాణాలకు గ్రహణం' అనే కథనం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. కథనంపై రాష్ట్రస్థాయి నాయకుల్లో చర్చలు జరగడంతో ఎట్టకేలకు మంగళవారం రాత్రి ఆగిపోయిన పోలీసు క్వార్టర్స్ నిర్మాణానికి తెరపడినట్లు అయింది. స్థానిక నేతల నుంచి జిల్లా పోలీసు విభాగం బుధవారం భూమి పూజ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ఆదేశాలు రావడంతో హుటాహుటిన ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం ఎమ్మెల్యే పోలీసు క్వార్టర్స్ నిర్మాణాలకు భూమి పూజ చేసి పనులకు శ్రీకారం చుట్టారు. ఐజీపీ వర్తిక కటియార్‌తో పాటు ఎస్పీ డాక్టర్ శోభారాణి, అధికారులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



పోలీసు క్వార్టర్స్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి

ప్రాణ రక్షణకు ప్రథమ చికిత్స అవసరం

● ఇండియన్ రెడ్‌క్రాస్ సభ్యుడు షకీబ్

బళ్లారి సిటీ,జూలై 16(ఆంధ్రజ్యోతి): ప్రాణాలను రక్షించేందుకు ప్రథమ చికిత్స చాలా కీలకమని ఇండియన్ రెడ్‌క్రాస్ జిల్లాశాఖ సభ్యుడు ఎం.ఎ.షకీబ్ అన్నారు. విజయనగరంలోని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం లైఫ్ సైన్సెస్ హాల్‌లో విద్యార్థి సంక్షేమ విభాగం, జంతుశాస్త్ర విభాగం సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో ప్రథమ చికిత్స చాలా ముఖ్యమన్నారు. ప్రమాదవశాత్తు అనారోగ్యాలు లేదా గాయాలు సంభవించినప్పుడు తక్షణ సహాయం ప్రాముఖ్యతను అర్థం చేసుకోవాలన్నారు. ఇది అత్యవసర పరిస్థితిని అదుపులోకి తీసుకురావడంలో సహాయపడుతుందన్నారు. వైస్ చాన్స్‌లర్ ఎం.మునిరాజు మాట్లాడుతూ విద్యార్థులు రక్తదానం చేయడం ద్వారా మంచి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని అన్నారు. నిర్దిష్ట పరిస్థితిని బట్టి ప్రథమ చికిత్స అందించాలన్నారు. అత్యవసర వైద్య పరిస్థితిల్లో సమర్థవంతంగా స్పందించడానికి ప్రతి ఒక్కరికీ ప్రథమ చికిత్స పరిజ్ఞానం ఉండాలన్నారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ నాగరాజు మాట్లాడుతూ విద్యార్థులు ప్రథమ చికిత్స ఎలా చేయాలో ఇతరులకు నేర్పించాలని అన్నారు. వివిధ విభాగాల డీన్‌లు, అధిపతులు, సమన్వయకర్తలు, లెక్చరర్లు, పరిశోధనా విద్యార్థులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



మొక్కకు నీరుపోసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న షకీబ్, వైస్‌చాన్స్‌లర్ మునిరాజు

పురావస్తు ప్రదేశాల్లో తవ్వకాలకు అనుమతి

బళ్లారి సిటీ, జూలై 16(ఆంధ్రజ్యోతి): నిపుణుల కమిటీ సిఫార్సుల మేరకు పట్టణంలోని చరిత, స్మారక చిహ్నాలు, పురావస్తు ప్రదేశాల తవ్వకానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు హంపి, కమలాపూర్‌లోని పురావస్తు శాస్త్రం, మ్యూజియంలు, వారసత్వ శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఆర్.షేజేశ్వర్ అన్నారు. బుధవారం తెక్కల కోటలోని బేల్‌తోట వద్ద గౌడ కోనేరు, హిరేహర్ల దగ్గర తవ్వకం కోసం ఒక స్థలాన్ని గుర్తించారు. తవ్వకం అధ్యయనం మొత్తం ఐదుగురు నిపుణుల నేతృత్వంలో చేపడతామన్నారు. తవ్వకాల బృందం సహ డైరెక్టర్, అమెరికాలోని హార్ట్‌విక్ విశ్వవిద్యాలయం నుంచి ప్రొఫెసర్ నమితా సుగంధి మాట్లాడుతూ చరిత్ర పూర్వకాలలను అధ్యయనం చేసే కోణం నుంచి ఆవిష్కరణ అవసరమన్నారు. 2015లో ఒకసారి తవ్వకాలు జరిగాయన్నారు. ప్రొడక్షన్ టీమ్‌లో అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీ ప్రొఫెసర్ వినాయక్, అశోక యూనివర్సిటీకి చెందిన ఆకాశ్ శ్రీనివాస, మొహాలీకి చెందిన మిహిర్ తంగసాలి, వైషి రాయ్, ఢిల్లీ అసిస్టెంట్ కలెక్టర్ దేవేంద్ర సింగ్ చౌదరి, పరిశోధకుడు అశోక్ అబాకారి పాల్గొన్నారు.



తెక్కల కోట చారిత్రక ప్రదేశాలను పరిశీలిస్తున్న తవ్వకాల బృందం

కాచిగూడ-రాయచూరు రైలును
గుంతకల్లు వరకు పొడిగించాలి



ఎంపీ కుమార్‌నాయక్‌కు వినతి పత్రం ఇస్తున్న ప్రయాణికులు

రాయచూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): తెలంగాణ హైదరాబాద్ కాచిగూడ నుంచి గద్వాల మీదుగా రాయచూరు వరకు నడుస్తున్న రైలును గుంతకల్లు వరకు పొడగించాలి ప్రయాణికులు కోరుతున్నారు. బుధవారం రాయచూరు లోకసభ సభ్యుడు జీ కుమార్ నాయక్‌ను కలిసి పలువురు ప్రయాణికులు వినతి పత్రం ఇచ్చారు. ఉదయం కాచిగూడ నుంచి బయలుదేరి మధ్యాహ్నం 12 గంటల వరకు రాయచూరుకు చేరుకుంటున్న ఈ రైలు టైమింగ్ కోసం మరో ట్రిప్ గద్వాల వరకు వెళ్లి వస్తున్నా ఆర్థికంగా ఎలాంటి ప్రయాజనం లేదన్నారు. దీని బదులు ఆ సమయాన్ని గుంతకల్లు వరకు పొడగించడం వల్ల హైదరాబాద్‌కు వెళ్లే ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉంటుందని ఎంపీకి వివరించారు.

35వ వార్డులో సౌకర్యాలు మెరుగు పరచాలి

● ఎమ్మెల్సీ వసంత్ కుమార్

రాయచూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): నగరంలోని 35వ వార్డు రాంపుర తదితర ప్రాంతాల్లో సౌకర్యాలు మెరుగుపరచాలని ఎమ్మెల్సీ వసంత్ కుమార్ కోరారు. బుధవారం మహానగర పాలికె కమిషనర్‌కు ఈ మేరకు ఆయన బహిరంగ లేఖ రాశారు. వార్డును సందర్శించిన ఆయన అక్కడి పరిస్థితుల గురించి స్థానికులతో మాట్లాడారు. శౌచాలయం పూర్తిగా శిథిలమైందని, కొత్తది నిర్మించాలని స్థానికులు కోరారు. అదే సమయంలో డ్రైనేజీ లేక అవస్థలు పడుతున్నామని డ్రైనేజీ నిర్మాణానికి చర్యలు చేపట్టాలన్నారు. ఇదే విషయాన్ని కమిషనర్‌తో మాట్లాడిన ఎమ్మెల్సీ నిధుల లభ్యతను బట్టి వెంటనే పనులు చేపట్టాలని, అవసరమైతే ఎమ్మెల్సీ అభివృద్ధి నిధులు కేటాయిస్తానన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వసంత్ కుమార్

భూసేకరణ నోటిఫికేషన్ ఉపసంహరణ

● రైతుల సంబరాలు

బళ్లారి సిటీ, జూలై 16(ఆంధ్రజ్యోతి): దేవనహళ్ళి తాలూకాలోని చన్నరాయపట్నంలో భూసేకరణ కోసం జారీ చేసిన నోటిఫికేషన్‌ను ప్రభుత్వం ఉపసంహరించుకోవడంతో రైతులు సంబరాలు చేసుకున్నారు. విజయోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని గడిగి చెన్నప్ప (రాయల్)సర్కిల్ నుంచి దుర్గమ్మ ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు మాధవరెడ్డి మాట్లాడుతూ.. బెంగళూరు గ్రామీణ జిల్లాలోని దేవనహళ్లి సమీపం 13గ్రామాల రైతుల భూమిని సేకరించే నిర్ణయాన్ని ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఉపసంహరించుకున్నారన్నారు. ఇది రైతుల సుదీర్ఘ పోరాటానికి విజయమని అన్నారు. తమ జీవనోపాధి కోసం ఉపయోగించుకునే రైతులను కాపాడుకోవడం ప్రభుత్వ ప్రాథమిక కర్తవ్యమని, దానిని కార్పొరేట్ కంపెనీలకు ఇవ్వకూడదని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర రైతు సంఘం నాయకుడు బసవరాజు మాట్లాడుతూ చన్నరాయపట్టణంలో పోరాటంలో పాల్గొన్న రైతులపై పెట్టిన తప్పుడు కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పోరాటంలో ఉండగా ప్రమాదంలో మరణించిన అంజనప్ప, గుండెపోటుతో మరణించిన గుండ్లుపేట తాలూకాకు చెందిన ఈశ్వరప్ప కుటుంబాలకు పరిహారం చెల్లించాలన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యబాబు, ఏఐకేకేఎంఎస్ అధ్యక్షుడు గోవింద్, కేపీఆర్‌ఎస్ అధ్యక్షుడు శివశంకర్ పాల్గొన్నారు.



సంబరాలు చేసుకుంటున్న రైతులు

హోసూరు జోన్

వాలీబాల్ పోటీల్లో హోసూరు విద్యార్థుల ప్రతిభ

హోసూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో హోసూరుకు చెందిన ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. ఈనెల 14, 15 తేదీలలో మధురైలోని ఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ సాంకేతిక కళాశాలలో రాష్ట్ర స్థాయి పోటీలలో బాల బాలికలు పాల్గొన్నారు. 40కుపైగా జట్లు పాల్గొన్నాయి. తంగవేలు వాలీబాల్ అకాడమీలో శిక్షణ పొందుతున్న విద్యార్థినులు, హోసూరు బాగలూరు రోడ్డులోని యోగి వేమన పాఠశాలలో చదువుతున్నారు. కోచ్ మాణిక్యవాసగం, పాఠశాల లీడర్ మునిరెడ్డి, అధ్యాపకుడు కార్తీక్ ప్రశంసించారు. ప్రతిభ చాటుకున్న విద్యార్థులను ప్రశంసాపత్రాలు అందచేసి కొనియాడారు.



ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

కృష్ణగిరి డ్యాం నుంచి నీటి విడుదల



నీటిని విడుదల చేస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

కృష్ణగిరి రూరల్, జూలై 16(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి రిజర్వు ప్రాజెక్టు (కేఆర్‌పీ) డ్యాం నుంచి నీటిపారుదలకోసం నీటిని విడుదల చేశారు. కృష్ణగిరి కలెక్టర్ దినేశ్‌కుమార్, బర్గూరు ఎమ్మెల్యే మధియజగన్ నీటిని విడుదల చేసి పూలవర్షం కురిపించారు. ఈరోజు నుంచి 120 రోజుల పాటు ఆనకట్ట కుడి, ఎడమ కాలువల ద్వారా నీటిని విడుదల చేయనున్నట్లు ప్రజా పనులశాఖ తెలిపింది. రైతుల సంక్షేమమే లక్ష్యంగా పంటలసాగుకు కాలువల ద్వారా నీటిని విడుదల చేశామన్నారు.

బిహార్ కార్మికుడి మృతి

హోసూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): రసాయన ఫ్యాక్టరీలో ఒక డ్రమ్ అకస్మాత్తుగా పేలిన ఘటనలో బిహార్ రాష్ట్రానికి చెందిన అజయ్‌కుమార్ (29) మృతి చెందాడు. ఈనెల 14న అతను 35 లీటర్ల రసాయన డ్రమ్‌ను తెరిచిన వేళ అకస్మాత్తుగా పగిలి పోయింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ అజయ్‌కుమార్ మృత్యువాత చెందాడు. శూలగిరి ఇన్‌స్పెక్టర్ సయ్యద్ సుల్తాన్ బాషా సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కృష్ణగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకున్నారు.



కుష్టిగి వద్ద పంటను మేస్తున్న పశువులు

పంట.. పశువుల పాలు..!

● మొహం చాటేసిన వరుణుడు

కంప్లి, జూలై 16(ఆంధ్రజ్యోతి): భూమిని నమ్ముకొని బతుకుతున్న రైతన్నలకు ఖరీఫ్ పంటలు కష్టాన్ని మిగిల్చాయి. ముందస్తు వర్షాలు కురవడంతో భూమిని నమ్మి రైతులు పంటలు వేశారు. కానీ పంటలు పెరిగే సమయంలో వర్షం రాకపోవడంతో అవి ఎండి పోతున్నాయి. కొప్పళ జిల్లాలో పలు గ్రామాల్లో సజ్జ, జొన్న మినప తదితర పంటలు వేశారు. వర్షం రాకపోవడంతో పంటలు ఎండి పోతున్నాయి. రైతులకు దిక్కుతోచని పరిస్థితుల్లో చివరకు పశువుల పాలు చేశారు. రైతు నాగరాజు మాట్లాడుతూ ఐదు ఎకరాల్లో వర్షాన్ని నమ్ముకొని సజ్జ పంట వేశామని వర్షం రాకపోవడంతో ఎండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.ఐదు వేలు నుంచి రూ.7 వేల వరకు ఎకరానికి పెట్టుబడులు పెట్టామని తెలిపారు.

లెక్చరర్లపై కఠిన చర్యలు తీసుకోవాలి



నిరసన తెలుపుతున్న ఏఐడీఎస్ఓ నాయకులు

బళ్లారి సిటీ, జూలై 16(ఆంధ్రజ్యోతి): బెంగళూరులో విద్యార్థినిపై అత్యాచారంచేసి బెదిరించిన ఇద్దరు లెక్చరర్లు, వారి స్నేహితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐడీఎస్ఓ విద్యార్థి సంఘం బుధవారం జిల్లా ఆసుపత్రి కాంపౌండ్ సమీపంలో నిరసన వ్యక్తం చేశారు. సంఘం జిల్లా కార్యదర్శి కంబలి మంజునాథ్ మాట్లాడుతూ బెంగళూరులో విద్యార్థినిపై అత్యాచారం చేసి బెదిరించిన లెక్చరర్లు, వారి స్నేహితుడిని కఠినంగా శిక్షించాలన్నారు. యువతులపై హింస రోజురోజుకూ పెరుగుతోందన్నారు. ఒడిషాలో కళాశాల లెక్చరర్ లైంగిక వేధింపులతో విసిగిపోయిన విద్యార్థిని నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకుందన్నారు. నిందితులపై కఠినశిక్ష విధించకపోతే ఇలాంటి కేసులు పెరుగుతాయన్నారు. లైంగిక వేధింపుల నుంచి విద్యార్థినులను రక్షించేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. బాధితురాలికి ప్రతి ఒక్కరూ మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కె.ఈరన్న, ఉపాధ్యక్షురాలు ఎం.శాంతి, ఆఫీస్ బేరర్లు హొన్నూర్ స్వామి, గిరీశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

జలధికి తరలిన పీర్లు





సిరుగుప్పలో పీర్లను ఊరేగిస్తున్న భక్తులు

సిరుగుప్ప, జూలై 16(ఆంధ్రజ్యోతి): తాలూకాలో పీర్లు గురువారం జలధికి తరలాయి. తాలుకా వ్యాప్తంగా చిన్న మొహర్రం పండుగ ముగిసింది. పీర్లను పట్టణ పురవీధులలో ఊరేగించారు. అనంతరం తుంగభద్ర నదిలో, బావులలో చెరువుల వద్ద నిమజ్జనం చేశారు. పట్టణంలోని కూరగాయల మార్కెట్ ఆవరణలో పీర్ల ఊరేగింపు కార్యక్రమానికి వేలాదిమంది తరలివచ్చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఆర్టీఓ కార్యాలయంలో లోకాయుక్త తనిఖీ



ఆర్టీఓ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న లోకాయుక్త అధికారులు

రాయచూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రాంతీయ రవాణా శాఖ కార్యాలయాన్ని బుధవారం లోకాయుక్త అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. లోకాయుక్త డీఎస్పీ రవి పురుషోత్తమ్ ఆధ్వర్యంలోని అధికారుల బృందం కార్యాలయానికి చేరుకుని అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆర్టీఓ కార్యాలయంలో లైసెన్స్‌ల జారీ మొదలుకొని ఆర్‌సీబుక్‌ల కేటాయింపు ఇతరత్రా వ్యవహారాలు ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేస్తున్నారని, అధికారుల నిర్లక్ష్య వైఖరితో వ్యవహరిస్తున్నారని ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు తనిఖీలు చేపట్టినట్లు లోకాయుక్త డీఎస్పీ రవి పురుషోత్తమ్ తెలిపారు. ఆర్టీఓ కార్యాలచయంలో రిజిస్ట్రేషన్ కోసం నమోదు చేసుకున్న దరఖాస్తులు ఇప్పటి వరకు పూర్తి అయిన లైసెన్స్‌లు కొత్త లైసెన్స్‌లు రెన్యువల్, చేంజ్ ఆఫ్ అడ్రస్ తదితర దరఖాస్తులన్నింటిని అధికారులు పరిశీలించినట్లు ఆర్టీఓ కార్యాలయం వర్గాలు తెలిపాయి.

సస్యరక్షణతో అధిక దిగుబడులు

గుడిబండ, జూలై 16(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ సాగులో రైతులు సస్యరక్షణ చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయశాఖ అధికారి వీరనరేష్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని హిరేతుప్పి, కెఎన్ పల్లి గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఏఓ మాట్లాడుతూ అధికారులు ఇచ్చే సూచనలు, సలహాలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఈఓ శారద, మంజుళ, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

పెనుకొండ రూరల్, జూలై 16(ఆంధ్రజ్యోతి): పేదలకు అందించే రేషన్ బియ్యం కర్ణాటకకు తరలిస్తుండగా కియా పోలీసులు పట్టుకున్నారు. ఏఎస్ఐ వెంకటరమణ తెలిపిన వివరాల మేరకు ధర్మవరానికి చెందిన డ్రైవర్ ముత్యాలప్ప, క్లీనర్ సోము బొలేరో వాహనంలో 60 బస్తాల రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారు. గుట్టూరు ఫ్లైజంక్షన్ వద్దకు రాగానే పోలీసులు వాహనాన్ని తనిఖీ చేసి బియ్యం స్వాధీనం చేసుకుని ఇరువురిని అదుపులోకి తీసుకున్నారు.